సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించడానికి, పోరాడటానికి, ఓడించడానికి ఇదే తరుణం

- ఆర్‌. అరుణ్ కుమార్

ప్రత్యేక వ్యాసం

3వ పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

సిటీ

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 171 | విజయవాడ, సోమవారం 23 జనవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 23 January 2023 | Rs

డిజిపి అఫీసియల్ ట్విట్టర్ అక్కౌంట్ హ్యాక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర డిజిపి కార్యాలయం కేంద్రంగా 2019లో సృష్టించిన dgpapofficial పేరుతో వున్న ట్విట్టర్ ఖాతా హ్యాక్ గురైంది. ఈ ట్విట్టర్ ఖాతాను డిజిపి కార్యాలయం 2020 నుండి వినియోగించకపోవడంతో ఇటీవల ఈ ఖాతాను హ్యాక్ చేసి తప్పుడు ఫొటోలు, మెసేజ్‌లను పెట్టడంతో పాటు వేరే వాటికి వాటికి లైక్‌లు ఇస్తున్నట్లు రాష్ట్ర పోలీసులు గుర్తించారు. ఉద్దేశ్యపూర్వకంగా ఈ ట్విట్టర్ ఖాతాను హ్యాక్‌చేసి వినియోగిస్తున్న తీరుపై రాష్ట్ర సైబర్ క్రైమ్ విభాగపు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సాంకేతిక డిఐజి పిహెచ్‌డి రామకృష్ణ తెలిపారు. డిజిపి ట్విట్టర్ ఖాతాను హ్యాక్ చేసిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సబ్‌ప్లాన్ పొడిగిస్తూ ఆర్డినెన్స్

- ప్రజా పోరాటంతో మరో 10 ఏళ్ల పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

షెడ్యూలు తరగతులు, షెడ్యూలు తెగల ఉపప్రణాళిక (ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్) చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో పదేళ్ల పొడిగించింది. ఈ నెల 23తో చట్టం కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో పొడిగించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా కుల వివక్ష వ్యతిరేక పోరాటం సంఘం (కెవిపిఎస్) వంటి ప్రజాసంఘాలు, వామపక్షాలు వివిధ రూపాల్లో ఉద్యమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం అమలు కాలాన్ని మరో 10 ఏళ్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నాడు ఆరినెన్స్‌ను జారీ చేసింది. ప్రభుత్వాలు ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్లలో దళితులకు, గిరిజనులకు ప్రత్యేక వాటా కింద నిధులు కేటాయించేందుకు, ఆ నిధులు వారి సంక్షేమానికి, సుస్థిరాభివృద్ధికి మాత్రమే ఖర్చు చేసేలా చూసేందుకు పటిష్టమైన చట్టం ఉండాలని కోరుతూ కెవిపిఎస్ తదితర ప్రజా సంఘాలు, వామపక్షాలు పెద్ద ఎత్తున పోరు సల్పడంతో 2013లో ఈ చట్టం పురుడుపోసుకుంది. పదేళ్ల కాల పరిమితితో వచ్చిన ఈ చట్టం గడువు ఈ నెల 23తో తీరిపోనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్న వైనాన్ని గమనించి నాటి పోరాటస్ఫూర్తితో మళ్లీ ప్రజాసంఘాలు, వాపమక్షాలు చట్టాన్ని పొడిగించాలని కోరుతూ ఉద్యమించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సబ్‌ప్లాన్‌ను పొడిగిస్తూ ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చింది.

సబ్‌ప్లాన్ కొనసాగింపుపై సిపిఎం హర్షం

లోపలి పేజీలో..

కార్మికుల జీవనంపై కేంద్రం దాడి

విషభావజాలాన్ని నింపేపనిలో బిజెపి

- ఐక్యంగా తిప్పికొడదాం.. దేశాన్ని కాపాడుకుందాం
- సిఐటియు బహిరంగ సభలో తపన్‌సేన్
- కార్మికులకు అండ ఎర్ర జెండా : కె హేమలత

బెంగుళూరు నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

కార్మికుల జీవన విధానంపై మోడీ సర్కారు దాడి తీవ్రతరం చేసిందని, కార్పొరేట్ల కోసం పర్మినెంట్ ఎంప్లాయిమెంట్ స్థానంలో అప్రెంటీస్, ట్రైనీ పనివిధానం తీసుకొస్తున్నదని సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విమర్శించారు. బిజెపి ప్రభుత్వ విధానాల వల్ల, కరోనా వల్ల 80 శాతం కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయని, చాలామంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ ఐదున ఢిల్లీలో జరిగే మజ్దూర్ కిసాన్ ఏక్తా ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు అఖిల భారత మహాసభ ముగింపు సందర్భంగా బెంగళూరులోని నేషనల్ కాలేజీ గ్రౌండ్‌లో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. సిఐటియు కర్ణాటక రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో తపన్‌సేన్ మాట్లాడారు. ఆజాదీకా అమృత్ మహోత్సవం ఒక నాటకమని, దాని పేరుతో ప్రజల్లో విష భావజాలాన్ని నింపేందుకు బిజెపి యత్నిస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల కోసం పనిచేస్తోందన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య విభజన చిచ్చు రాజేసి ప్రభుత్వరంగ సంస్థలను ప్యాకెట్ల రూపంలో విడగొట్టి కార్పొరేట్లకు కట్టబెడుతున్న తీరును వివరించారు. విద్యుత్తు రంగాన్ని అదానీకి అప్పగించే పనిలో ఉందని విమర్శించారు. అందులో భాగంగానే మహారాష్ట్రలో విద్యుత్తు పంపిణీ సంస్థలను ప్రయివేటీకరించేందుకు యత్నించగా, అక్కడి ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పోరాడడంతో బిజెపి సర్కారు వెనక్కి తగ్గిందన్నారు. బలమైన పోరాటాల ద్వారా పాలకుల విధానాలను వెనక్కి కొట్టొచ్చని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బలమైన పోరాటాల రూపకల్పనకు ఈ నెల 30న ఢిల్లీలో కార్మిక సంఘాల జెఎసి సమావేశం జరగబోతోందన్నారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని, మానవ హక్కులను, వ్యవసాయాన్ని, ప్రభుత్వ రంగ మిగతా 2లో

సిఐటియు నూతన నాయకత్వం

హేమలత - అధ్యక్షులు

తపన్‌సేన్ - ప్రధాన కార్యదర్శి

సాయిబాబు - కోశాధికారి

కానిస్టేబుల్ రాత పరీక్షకు 4, 58,219 మంది హాజరు

- ఈ నెల 25న కీ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 6,100 కానిస్టేబుల్ పోస్టుల నియమకాల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ఈ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 91శాతం మంది హాజరయ్యారు. 5,03,487 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా పరీక్షలకు 4,58,219 మంది హాజరయ్యారు. ప్రిలిమనరీ రాత పరీక్ష కోసం రాష్ట్రంలోని 34 ప్రాంతాల్లో 997 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. అలాగే పరీక్షా కేంద్రాలన్నింటినీ సిసి కెమేరాల నిఘాలో వుంచారు. స్ట్రాంగ్ రూమ్‌లు, పరీక్ష కేంద్రాలు వద్ద పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షల కీని ఈనెల 25 సాయంత్రం ఐదు గంటలకు విడుదల చేస్తున్నట్లు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది.

పరీక్షా రాసేందుకు శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ అక్షర కళాశాలకు ఒక మహిళా అభ్యర్థి, పలాసలోని సూర్యతేజ డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రానికి ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో పరీక్షకు అనుమతించలేదు. కాకినాడ జిల్లాలోనూ, రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ పలువురు విద్యార్థులు ఇటువంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు.

పది నిమిషాలు ఆలస్యమైందని ఆపేశారు

మాది అనకాపల్లి. కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నాం. కాకినాడలోని జెఎన్‌టికె పరీక్షా కేంద్రం ఇచ్చారు. పరీక్ష కోసం ఆదివారం ఉదయం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కాము. అది 20 నిమిషాలు ఆలస్యమైంది. జెఎన్‌టియుకెకు 10.10కి చేరుకున్నాం. పది నిమిషాలు ఆలస్యమైందని ఆపేశారు. ఎంత బతిమాలినా వినిపించుకోలేదు. అడిషనల్ ఎస్‌పికి మొరపెట్టుకున్నా కనికరించలేదు.

- శిరీష, సత్యవతి, అభ్యర్థులు, అనకాపల్లి

3 లక్షల మందికి అందని ఇళ్ల స్థలాలు

కోర్టు కేసుల్లో లక్షమంది పేదల పట్టాల భూములు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 30.30లక్షల మంది అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం భావించినప్పటికీ ఆచరణలో సుమారు 25లక్షల మందికి పైగా ఇంటి పట్టాలు రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసింది. మరో 1,01,580 మందికి సంబందించిన పట్టాలు మంజూరు చేసిన స్థలాలకు సంబందించి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. మరో 50 వేల మంది లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాలు శ్మశానాలు, మునక ప్రాంతాల్లో ఉన్నాయని, వాటికి ప్రత్నామ్నాయ స్థలాలు కేటాయించాలని సిఎం దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వారందరికీ నివాసయోగ్యమైన ప్రాంతాల్లో కేటాయించాలని సిఎం రెవెన్యూ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇది ఇలా ఉంటే విజయవాడ, గుంటూరుతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పేదలకు రాజధాని ప్రాంతంలో ఇంటి స్థలాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ అంశం కూడా కోర్టు పరిధిలో ఉండటంతో అర్హులకు ఇతర ప్రాంతాల్లో స్థలాలు కేటాయించక పోవడంతో ఆయా లబ్ధిదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షల మంది లబ్ధిదారులకు నేటికీ ఇంటి స్థలాలు మంజూరు కాలేదు. తక్షణమే స్థలాలు కేటాయించని వారి భూములను అన్వేషించాలని ఇటీవల సిఎం రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇది ఇలా ఉంటే నివేశన స్థలాలు కేటాయించిన వారిలో 17,929 మంది ఇళ్లు కట్టుకునేందుకు అయిష్టత వ్యక్తం చేశారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు కేటాయించేందుకు భూసేకరణ చేయడం క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులకు కత్తిమీద సాములాగా మారింది.

జిల్లా పేరు	మొత్తం కేసులు	కేసుల్లో ఉన్న లబ్ధిదారులు
పశ్చిమ గోదావరి	59	3341
ఏలూరు	100	5667
కృష్ణ	24	1251
ఎన్‌టిఆర్	28	27540
గుంటూరు	15	25483
పల్నాడు	31	1750
బాపట్ల	18	1891
ప్రకాశం	41	29743
నెల్లూరు	68	4914
మొత్తం	384	101580

లే అవుట్లు సిద్ధం కానివి 4650

వివిధ కారణాలు చూపుతూ రాష్ట్ర వ్యాప్తంగా లే అవుట్లు సిద్ధం చేయాల్సినవి నేటికీ 4650 వరకు ఉన్నట్లు రెవెన్యూశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో ఎన్‌టిఆర్ జిల్లాలో 2792, పల్నాడులో 22, బాపట్లలో 36, ప్రకాశంలో 956 లే అవుట్లు ఉన్నాయి.

25 నుంచి సమరయాత్ర

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఈ నెల 25 నుంచి మార్చి 4 వరకు సమరయాత్ర పేరుతో విద్యార్థి, యువజన సంఘాలు బస్సుయాత్ర చేపట్టనున్నాయి. హిందూపురం నుంచి ఇచ్చాపురం వరకూ ఈ యాత్ర సాగనుంది. యాత్ర పోస్టర్‌ను ఆదివారం విజయవాడలో డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్, ఎఐవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు పి రాజేంద్రప్రసాద్, పిడిఎస్‌యు నాయకులు కె రవిచంద్ర, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు శ్రీనివాస్, తెలుగు యువత నాయకులు నాగూరు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడుగడుగునా మోసం చేసిందన్నారు. బస్సు యాత్ర జరగనీయకుండా పోలీసులు భయానక వాతావరణం సృష్టించారనీ, కోర్టుల జోక్యంతో అనుమతి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సమరయాత్రను జయప్రదం చేయాలని కోరారు.

విద్యుదాఘాతానికి ఇద్దరు బలి

- బాపట్లలో విద్యార్థి, పల్నాడులో భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి-మేదరమెట్ల (బాపట్ల జిల్లా), మాచర్ల (పల్నాడు జిల్లా)

లక్ష్మయ్య మృతదేహం

వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతానికి ఇద్దరు బలయ్యారు. వారిలో ఒకరు విద్యార్థి కాగా, మరొకరు భవన నిర్మాణ కార్మికుడు. ఇందులో ఒక ఘటన బాపట్ల జిల్లాలో, మరో ఘటన పల్నాడు జిల్లాలో చోటు చేసుకుంది. ఆదివారం జరిగిన ఈ ఘటనలకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం దైవాలరావూరులో అదే గ్రామానికి చెందిన గడ్డం అఖిల్ (11), నూకతోటి జయబాబు అనే విద్యార్థులు బస్టాండ్ సెంటర్‌లో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో కాయలు కోసుకొనేందుకు సమీపంలోని బాదం చెట్టు ఎక్కారు. చెట్టు సమీపంలోని 11 కెవి విద్యుత్తు తీగలు వారికి తగిలాయి. దీంతో, చెట్టుపై అఖిల్ అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. జయబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరూ ఆరో తరగతి చదువుతున్నారు. పల్నాడు జిల్లా మాచర్ల పట్టణానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు తుమ్మల లక్ష్మయ్య (45) రెంటచింతల మండలం మంచికల్లులో సచివాలయ భవనానికి స్లాబు నిర్మాణ పనులు వేసేందుకు వచ్చారు. మిల్లర్‌కు అవసరమైన నీటి కోసం మోటారు వేయడానికి తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న స్విచ్ బోర్డు వద్దకు వెళ్లారు. స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందారు.

అఖిల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

కోర్టు కేసులపై అప్రమత్తం

- నెలవారీ నివేదికలు సిద్ధం చేయండి
- కలెక్టర్లు, లైన్ డిపార్టుమెంట్స్ హెఓడిలకు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హైకోర్టులో కేసుల సంఖ్య పెరిగిపోతోందని, ఈ నేపథ్యంలో కోర్టు కేసుల పట్ల జిల్లా కలెక్టర్లు, లైన్ డిపార్టుమెంట్స్ హెచ్‌ఓడిలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలంటూ గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం (జిఎస్‌డబ్ల్యుఎస్) డిపార్టుమెంట్ డైరెక్టర్ షణ్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు కేసులకు సంబందించి నెల వారీ నివేదికలు సిద్ధం చేయాలని, కేసులకు సంబందించిన అప్‌డేట్స్ ఎప్పటికప్పుడు తెలియజేసే విధంగా గ్రామ వార్డు సచివాలయం ఫంక్షనరీస్, వాలంటీర్లను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఫంక్షనరీస్‌లకు సంబందించి హైకోర్టులో 1200 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేసులకు సంబందించి జిల్లా స్థాయి అధికారులు, లైన్ డిపార్టుమెంట్స్, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ, విలేజ్ వార్డు సెక్రటరీస్ ఎప్పటికప్పుడు జిఎస్‌డబ్ల్యుఎస్ న్యాయ విభాగం అధికారులకు సమాచారాన్ని ఇస్తూ కోర్టు కేసులను ఫాలో కావాల్సి ఉంటుందని తెలిపారు. నెలలో ఎటువంటి కేసులు లేని పక్షంలో నిల్ రిపోర్టు ఉన్నతాధికారులకు సమర్పించాలని కూడా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇందుకోసం 12 కాలమ్స్‌తో ప్రొఫార్మాను కూడా విడుదల చేశారు. ఇందులో గ్రామ వార్డు సచివాలయం సెక్రటరీ, లా ఆఫీసరు జిఎస్‌డబ్ల్యుఎస్ డిపార్టుమెంట్ అధికారి అప్రూవల్ సంతకాలు చేయాలని సూచించారు. కోర్టుకు సంబంధించి ఫైలింగ్ చేసే సమయంలో పేరా వైజ్ రిమార్క్స్, డ్రాఫ్ట్ కౌంటర్స్ గురించి న్యాయనిపుణులతో సంప్రదించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ 2019, 2020, 2021 సంవత్సరాలకు చెందినవని తెలిపారు. కోర్టు కేసులకు సంబంధించిన ఖర్చులను సర్వీస్ ఛార్జీల నుంచి ఉపయోగించుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

లాస్‌ఏంజెల్స్‌లో కాల్పులు..

- 10 మంది మృతి

లాస్‌ఏంజెల్స్ : అమెరికాలో మరో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. లాస్ ఏంజెల్స్ మాంటేరీ పార్క్‌లో చైనీయుల కొత్త సంవత్సరం వేడుకల వద్ద ఓ దుండగుడు విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు. దీంతో, 10 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 10 మందికిపైగా తీవ్ర గాయాల పాలయ్యారు. కాలిఫోర్నియా లాస్ ఏంజెల్స్ సమీపంలోని మాంటేరీ పార్క్ బాల్‌రూమ్ డ్యాన్స్ క్లబ్‌లో శనివారం రాత్రి 10 గంటల సమయంలో కాల్పులు జరిగినట్లు లాస్ ఏంజెల్స్ షెరిఫ్ డిపార్ట్‌మెంట్ మేయర్ కెప్టెన్ అండ్రూ తెలిపారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటన సమయంలో అక్కడ వేలాదిమంది ఉన్నట్లు పేర్కొన్నారు. మాంటేరీ పార్క్ లాస్ ఏంజెల్స్‌కు కౌంటీ. ఇది ప్రధాన నగరానికి 11 కిలోమీటర్ల దూరంలో ఉంది.

అమెరికా ఆంక్షలు అంతమొందిస్తాం

- ప్రజల మద్దతుతో సామ్రాజ్యవాదంపై ఐక్య పోరు
- చే గువేరా కుమార్తె అలైదా గువేరా
- హైదరాబాద్‌లో క్యూబా సంఘీభావ సభ

సభలో మాట్లాడుతున్న అలైదా గువేరా

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

అమెరికా సామ్రాజ్యవాదం విధిస్తోన్న క్రూరమైన, అమానవీయ ఆంక్షలను అంతమొందిస్తామని చే గువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా అన్నారు. దీనికి అంతర్జాతీయంగా అన్ని దేశాల సంఘీభావం క్యూబా ప్రజలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో సామ్రాజ్యవాదంపై ఐక్యంగా పోరాడతామన్నారు. నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా (ఎన్‌సిఎస్‌సి), అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో 'క్యూబా సంఘీభావ సభ' జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అలైదా గువేరా మాట్లాడుతూ చే గువేరా కుమార్తె కన్నా క్యూబా పౌరురాలిగా ఉండడం గర్వకారణమన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని, ఆయన ఆదర్శాలను ప్రేమించాలని సూచించారు. చే గువేరా పరిపూర్ణ కమ్యూనిస్టు అని వివరించారు. చిన్న దేశమైన క్యూబా అమెరికా సామ్రాజ్యవాదంపై పోరాడుతోందన్నారు. తమ దేశంలోని ప్రజలు సామ్యవాద సమాజాన్ని నిర్మించేందుకు ముందుకెళ్తున్నారని తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థపై ఆధారపడకుండా సోషలిజం విధానంలో బతకొచ్చనే విషయాన్ని ప్రపంచ దేశాలకు క్యూబా నేర్పిందన్నారు. అందుకే తమ దేశమంటే అమెరికా సామ్రాజ్యవాదానికి భయమని వివరించారు. క్యూబాలో సహజ సంపదకు ప్రజలే యజమానులని తెలిపారు. క్యూబా తరహాను ఇతర దేశాలూ అనుసరిస్తే ఎలా అనే భయం అమెరికాకు పట్టుకుందన్నారు. అందుకే ఆర్థిక దిగంధనం కలిగిస్తోందన్నారు. అమెరికా ఆంక్షలను అధిగమించి తమ ప్రజల అవసరాలన్నీ తీర్చుకుంటున్నామని తెలిపారు. సమాజంలో మార్పు రావాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. ఫైడల్ కాస్ట్రో మొదటి నుంచీ విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. దీనివల్ల మహిళా సాధికారత వచ్చిందన్నారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ క్యూబాపై అమెరికా సామ్రాజ్యవాదం విధిస్తోన్న ఆంక్షలు, నిర్బంధాలను ఖండిస్తున్నామన్నారు. క్యూబాకు భారత ప్రజలు అండగా నిలబడాలని కోరారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా ఎర్ర జెండాను, సోషలిస్టు పంథాను క్యూబా వీడలేదని తెలిపారు. చే గువేరా ప్రపంచ మానవుడని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారాణి, ప్రొఫెసర్ హరగోపాల్, పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రజా సంఘాల, రాజకీయ పార్టీల నాయకులు సమావేశానికి హాజరయ్యారు.

రావిపూడికి నివాళులర్పిస్తున్న బాలసుబ్రహ్మణ్యం

రావిపూడి ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్ (ప్రకాశం జిల్లా)

హేతువాదిగా ముద్ర వేసుకున్న రావిపూడి వెంకటాద్రి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కోరారు. ఇంకొల్లు రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ ఆవరణలో రావిపూడి వెంకటాద్రి భౌతిక కాయాన్ని ఆయన ఆదివారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విఠపు మాట్లాడుతూ రావిపూడి హేతుబద్ధంగా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకొని 40 సంవత్సరాలు నాగండ్ల గ్రామ సర్పంచిగా పని చేశారని అన్నారు. గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. రావిపూడి వెంకటాద్రి మృతదేహాన్ని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రాయపూడి కుటుంబ సభ్యులు ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు జరిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

రైలు ఢీకొని ముగ్గురు మృతి

ప్రజాశక్తి -నెల్లూరు

రైలు ఢీకొని ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ సంఘటన నెల్లూరు నగరంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఇద్దరు పురుషులు, ఓ మహిళ వస్తుండగా గూడూరువైపు నుంచి విజయవాడ వెళ్తున్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు. మృతదేహాల వద్ద లభించిన ఆధారాల ప్రకారం మృతులు కృష్ణా జిల్లా నందివాడకు చెందిన సరస్వతీరావు (46), నెల్లూరు జిల్లా ముత్యాలంపాడుకు చెందిన గుండుబోయిన పోలయ్య (24), గుమ్మడి సుగుణమ్మ (74)గా గుర్తించారు. ప్రమాదమా లేక ఆత్మహత్యకు పాల్పడ్డారా అన్న కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

30లోగా గృహ సారథుల నియమకాలు : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనిర్మాణాన్ని సచివాలయాల స్థాయిలో పటిష్టపరిచేందుకు కృషి చేయాలని వైసిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబాన్ని పార్టీతో మమేకం చేసేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల నియమకాలను ఈ నెల 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వైసిపి కేంద్ర కార్యాలయం నుండి పార్టీ జిల్లా అధ్యక్షులు, కీలక నేతలతో ఆదివారం నాడు సజ్జల టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల కన్వీనర్ల ఆధ్వర్యంలో గహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు ఫిబ్రవరిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలు క్రియాశీలకంగా వుండాలన్నారు. రాష్ట్ర పార్టీకి సంబంధించిన అంశాలు, ముఖ్యమంత్రి అభిప్రాయాలు, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని, విమర్శలను తిప్పికొట్టడం లాంటి అంశాల పట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ సమావేశంలో శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి కూడా పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల అధ్యయనానికి ఉన్నత స్థాయి బృందం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమిళనాడు, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాలు అసైన్డ్ భూములపై అవలంభిస్తున్న పద్ధతులను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలోని ఉన్నత స్థాయి బృందం ఆదివారం రాత్రి గన్నవరం విమానాశ్రయం నుంచి చెన్నై బయలు దేరి వెళ్లింది. సోమవారం చెన్నైలో ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవెన్యూ)తో భేటీ అవుతుంది. అనంతరం రాత్రికి బెంగుళూరుకు బయలుదేరి వెళ్లనుంది. మంగళవారం మధ్యాహ్నం కర్ణాటక ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవెన్యూ)తో భేటీ కానున్నారు. ఈ అధ్యయన బృందంలో ఐదుగురు మంత్రులు, 9 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. సిసిఎల్ఎ అడిషనల్ కమిషనరు ఎఎండి ఇంతియాజ్ కో ఆర్డినేటర్లగా వ్యవహరించనున్నారు.

'సీడ్స్'పై ఎన్‌జిటి సీరియస్

- బాధితులకు రూ.లక్ష చొప్పున చెల్లించాలని ఆదేశం
- సాగని ప్రభుత్వ ఆటలు
- ఇప్పటికీ బయటపెట్టని కమిటీ నివేదికలు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

విషవాయువు పీల్చి అనకాపల్లిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళలు (ఫైల్ ఫొటో)

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీలోని సీడ్స్ వస్త్ర పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం నివేదికను బహిర్గతం చేయకుండా ఎన్ని మాయోపాయాలు పన్నినా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) కార్మికుల్లో ఆత్మస్థైర్యం నింపే తీర్పు ఇచ్చింది. దీంతో, గ్యాస్ లీక్ ప్రమాదంలో అస్వస్థతకు గురై అనారోగ్యం పాలైన మహిళా కార్మికుల బాధలను వినిపించుకోలేని యాజమాన్యానికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. 539 మంది బాధితులకు లక్ష రూపాయల చొప్పున పరిహారం చెల్లింపుతోపాటు పర్యావరణ పరిరక్షణకు రూ.10 కోట్లు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఖాతాలో జమచేయాలని శుక్రవారం లిఖితపూర్వక ఉత్తర్వులు విడుదల చేసింది. దీనిని ఆరు నెలలలోగా అమలు చేయకపోతే కంపెనీని మూసేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు సూచించింది.

2022 జూన్ 3న, రెండు నెలల వ్యవధిలో ఆగస్టు 2న 'సీడ్స్'లో విష వాయువులు లీకవడంతో 539 మంది మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. సీడ్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంపై నియమించిన కమిటీ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం దాచిపెట్టినా, ఎన్‌జిటి మాత్రం ఊరుకోలేదు. మీడియా కథనాలను సుమోటోగా తీసుకోవడంతోపాటు 'ప్రజల కోసం శాస్త్రవేత్తలు' ఇచ్చిన నివేదికనూ స్వీకరించి, విచారణకు ఆరుగురు నిపుణులతో కూడిన బృందాన్ని నియమించింది. దీనిపై ఎన్‌జిటి చైర్మన్ జస్టిస్ ఆదర్శకుమార్ గోయెల్, జస్టిస్ సుధీర్ అగర్వాల్, ప్రొఫెసర్ సెంథిల్ వెల్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ ఏడాది జనవరి 18న విచారణ చేపట్టింది.

బహిర్గతంకాని నివేదికలు

కార్మికులు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరడంతో శాంపిల్స్‌ను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసిటి)కి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పంపారు. ప్రమాదంపై విచారణకు జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి నేతృత్వంలో కమిటీని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి నియమించారు. జూన్ పదిన ఐఐసిటి ఇచ్చిన నివేదికను ప్రభుత్వానికి కలెక్టర్ పంపారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ చేపట్టిన విచారణ నివేదికను బహిర్గతం చేయలేదు. రెండోసారి జరిగిన ప్రమాదంపై విడుదలైన వాయువుల శాంపిల్స్‌ను ఐఐసిటికి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పంపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) బృందం, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) బృందం సంఘటనా స్థలిని పరిశీలించాయి. అయినా, ఇంతవరకూ సీడ్స్ కంపెనీలో రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు జరిగిన ప్రమాద కారణాలు బహిర్గతపరచలేదు. కాగా, కమిటీ విచారణ పూర్తి కాకముందే ఎన్‌జిటి తీర్పు ఇవ్వడం పట్ల న్యాయస్థానానికి వెళ్తామని బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరైస్వామి 'ప్రజాశక్తి'కి చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌పై కుట్రలు తగవు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రయివేటీకరణ విధానం ముమ్మాటికీ తగదని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘాల నేతలు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 710వ రోజుకు చేరాయి. దీక్షల్లో కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా ఉత్పత్తిని కుదించి నష్టాలపాలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని తెలిపారు. ఈ నెల 30న ఉక్కునగరంలో జరిగే ఉక్కు ప్రజా గర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, జి.శ్రీనివాసరావు, కర్రి దాలినాయుడు, శశిభూషన్‌రావు, నమ్మి రమణ, పిట్టా రెడ్డి, వైటి.దాసు, డి.వి.రమణ, పి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఐదుగురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు

- మరో ఇద్దరిని బదిలీ చేస్తూ డిఇఒ ఉత్తర్వులు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో విధి నిర్వహణలో అలసత్వం వహించారనే పేరుతో ఇద్దరు ఉపాధ్యాయులను తొలగించాలని పేరెంట్స్ కమిటీ, వార్డు కౌన్సిలర్, తల్లిదండ్రులు చేసిన ఆందోళన చివరకు ఉపాధ్యాయుల సస్పెన్షన్ వరకూ దారితీసింది.

ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులపై బదిలీవేటు పడగా, అనుకోని విధంగా మరో ఐదుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ డిఇఒ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలి పట్టణం ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న క్రాఫ్ట్ టీచర్ విధినిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని, ఆమెకు హిందీ ఉపాధ్యాయిని వత్తాసు పలుకుతున్నారని పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజు, వార్డు కౌన్సిలర్ గెడ్డటి సురేంద్ర, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఈ నెల 7న పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. విధులకు సరిగా హాజరుకాని క్రాఫ్ట్ టీచర్‌ను విధుల నుంచి తొలగించాలని, హిందీ టీచర్‌ను పాఠశాల నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై డిఇఒ శైలజ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు.

తాజాగా క్రాఫ్ట్ టీచర్ విజయలక్ష్మిని కొలకలూరు హైస్కూలుకు, హిందీ టీచర్ నీలిమా ప్రశాంతిని మంగళగిరి మున్సిపల్ పాఠశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయులు కోటిరెడ్డి, ప్రసన్నాదేవి, నాగమ్మ, సంపూర్ణ, సోమశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాల ఎదుట జరిగిన ఆందోళనలో విద్యార్థులు పాల్గొనకుండా ఉపాధ్యాయులు నియంత్రించలేకపోయారని, ఎస్‌సిఇఆర్‌టి నిబంధనలు పాటించటంలేదని, సిసిఎ రూల్స్‌ను వ్యతిరేకించారని, ఈ విషయాలు తమ విచారణలో స్పష్టమైందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉత్తర్వులు ఈ నెల 19నే జారీ చేసినా గోప్యత పాటించడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులు సేఫ్‌గా ఉండటం, ఐదుగురు ఉపాధ్యాయులు సస్పెన్షన్‌కు గురికావడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దీనిపై వివరణ కోరేందుకు మండల విద్యాధికారి మేకల లక్ష్మినారాయణను సంప్రదించగా అది పూర్తిగా ఉన్నత పాఠశాలలకు సంబంధించిన అంశమని దాటవేశారు. డిఇఒ శైలజను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా ఆమె స్పందించలేదు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు నేరమా?

- గ్రామంలో పర్యటించిన కెవిపిఎస్, ఐద్వా, వ్యకాసం బృందం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

ఆలపల్లి గ్రామాన్ని సందర్శించిన కెవిపిఎస్, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం బృందం

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం అలపల్లి గ్రామంలోని ఎస్‌సి, ఎస్‌టిలను ఊరిలోకి రాకుండా రహదారిపై ముళ్లకంప అడ్డుగా వేసిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అనూరి ఈశ్వర్, ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి నాయకులతో కలిసి జరిగిన ఘటన గురించి గ్రామంలోని దళితులతో ఆదివారం మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ అలపల్లి గ్రామంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం పెట్టినందుకు ఎస్‌సి, ఎస్‌టిలను ఊరిలోకి రానీయకుండా సిమెంట్ రోడ్డు పైన వెళ్లడానికి దారి లేకుండా ముళ్ల కంపలు రాళ్లు వేసిన ఆధిపత్య అగ్రకుల దురహంకారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులకు స్వేచ్ఛా జీవితాన్ని అందించిన అంబేద్కర్ విగ్రహం గ్రామంలో ఏర్పాటు చేసుకోవడం నేరమా అని ప్రశ్నించారు. అగ్రకులాల పెత్తందారులు దళితులపై నిత్యం దాడులు చేస్తూ వివక్ష చూపుతున్నా రక్షణ కల్పించాల్సిన పోలీసులు పెత్తందారులకు కొమ్ముకాస్తుండడం దారుణమన్నారు. రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులనూ వినియోగించుకునే పరిస్థితి మండలంలోని ఎస్‌సి, ఎస్‌టిలకు ఉండడం శోచనీయమని పేర్కొన్నారు. దారి లేకుండా చేసిన వారిపై వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో మళ్లీ ఇలాంటి సంఘటన తలెత్తితే దళిత సంఘాలు ప్రజాసంఘాలు ఉద్యమాల్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వారి వెంట నాయకులు గిరి, వినోద్, తదితరులు ఉన్నారు.

కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ సాధనకు ప్రజా ఉద్యమం

ప్రజాశక్తి - అమలాపురం

కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ సాధన కోసం జిల్లా వ్యాప్తంగా ప్రజా ఉద్యమం నిర్వహిస్తామని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రైల్వే సాధన సమితి నాయకులు తెలిపారు. అమలాపురం రూరల్ భట్నవిల్లిలోని గతంలో రైల్వే శాఖ మంత్రి వేలు శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద రైల్వే సాధన సమితి, అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బొంతు రమణ, కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. 20 ఏళ్లుగా కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయన్నారు. రైల్వే లైన్ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 25 శాతం వాటా ఇవ్వలేదని కేంద్ర ప్రభుత్వం పనులు నిలిపివేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని లేకుంటే ప్రజలతో ఐక్యంగా కోటిపల్లి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి నుంచి నరసాపురం వరకు నిరసన ర్యాలీ చేపడతామని, దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేవు తిరుపతిరావు, గుంగుమళ్ల శ్రీనివాస్, బత్తుల సాయి, బిఎస్ మూర్తి, మహాదశ నాగేశ్వరరావు, డిబి లోక్, జంగా బాబూరావు, పి వసంతకుమార్, గోగి మురళి పాల్గొన్నారు.

ఎనర్జీ ఫోర్‌కాస్టింగ్‌పై ఇతర రాష్ట్రాలు ఆసక్తి

- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అమలు చేస్తున్న ఎనర్జీ ఫోర్‌కాస్టింగ్ మోడల్‌పై ఇతర రాష్ట్రాలు ఆసక్తిని కనబరిచాయని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. విద్యుత్ సంస్థలు అమలు చేస్తున్న ప్రాజెక్టులు, రాష్ట్ర పరిరక్షణ మిషన్ చేపట్టిన ఇంధన సామర్థ్య కార్యక్రమాలు, తదితర వాటి అనుభవాలను పంచుకోవాలని తమిళనాడు, రాజస్థాన్ తదితర రాష్ట్రాలు కోరాయని పేర్కొన్నారు. ఎపిట్రాన్స్‌కో ఇటీవల రెండు స్కోచ్ అవార్డులు(గోల్డ్, సిల్వర్)లను అందుకున్న నేపథ్యంలో ట్రాన్స్‌కో చర్యలపై ఆదివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. రెండు నెలల స్వల్ప వ్యవధిలో రాష్ట్ర విద్యుత్ సంస్థలు జాతీయ స్థాయిలో ఆరు ప్రధాన అవార్డులను సాధించాయని విజయానంద్ తెలిపారు. దేశంలోనే అత్యుత్తమ విద్యుత్ ప్రసార సంస్థగా ఎపి ట్రాన్స్‌కో అవతరించేందుకు అన్ని విధాలా కృషి చేయడంతో పాటు బలమైన చర్యలు తీసుకుంటుందని ట్రాన్స్ సిఎండి బి శ్రీధర్ వివరించారు. మౌలిక సదుపాయాల నిర్మాణ పనుల్లో భాగంగా మూడు 400కెవి సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీనిద్వారా ఎపిఈపిడిసిఎల్ పరిధిలో ఉన్న ఐదు జిల్లాలకు మరింత నాణ్యమైన విద్యుత్ అందించడంలో ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయానికి 9గంటల పగటిపూట విద్యుత్ సరఫరా, విద్యుత్ వ్యవస్థను మెరుగుపరిచే ఇతర ప్రాజెక్టులకు సంబంధించి సుమారు రూ.500కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్(జిఇసి) పథకం కింద చాలా వరకు పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులన్నీ చివరి దశలో ఉన్నాయని వివరించారు. ఎనర్జీ ఫోర్ కాస్టింగ్ మోడల్‌ను, జిఐఎస్ సిస్టమ్‌ను ట్రాన్స్‌కోలో ప్రవేశపెట్టడంలో ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఎవి భాస్కర్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో జెఎండిలు ఐ పృథ్వితేజ్, బి మల్లారెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ టి వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఇవ్వకపోయినా 'యువగళం' ఆగదు : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న పాదయాత్రను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాత్రకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా యాత్ర జరుగుతుందని స్పష్టం చేశారు. యువగళాన్ని అడ్డుకుంటే రాష్ట్ర యువతను అడ్డుకున్నట్టేనని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఒక ప్రకటనలో తెలిపారు. యువతలో వెల్లువెత్తిన ఆగ్రహం బయటపడకుండా వైసిపి అడ్డుపడాలని చూస్తోందని పేర్కొన్నారు. యువగళం యాత్రకు అడ్డుపడితే యువతే ముందుండి కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, డిజిపి ఇప్పటికైనా స్పందించి రాజ్యాంగయుత, ప్రజాస్వామ్యయుత పాలన అందించాలని, యువగళాన్ని అడ్డుకునే ప్రయత్నాలు ఆపాలని కోరారు. యాత్రను అడ్డుకోవాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మాజీమంత్రి కెఎస్ జవహర్ హెచ్చరించారు. డిజిపి, పోలీసులు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్ రెడ్డి ఉలిక్కిపడుతున్నారని పేర్కొన్నారు. 'ఆయన డిజిపి కాదు, కసిరెడ్డే' అని మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఎప్పుడు లేని ఆంక్షలు లోకేష్ పాదయాత్రకు ఎందుకు పెడుతున్నారని మాజీమంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. సాగనిస్తే పాదయాత్ర అని, అడ్డుకుంటే ప్రభంజనం అని ట్విట్టర్‌లో మాజీఎమ్మెల్సీ బుద్దావెంకన్న పేర్కొన్నారు. లోకేష్ యాత్ర అంటే వైసిపి నాయకులు, అధికారులకు భయం ఎందుకు అని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. డిజిపి తన లేఖను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతి ఇవ్వకపోయినా పాదయాత్ర ఆగదని తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మితే.. పేద వర్గాలకు తీవ్ర నష్టం

- దేశంలో బొగ్గు గని కార్మికులందర్నీ ఏకం చేయాలి
- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మితే ప్రజలకు తీరని నష్టం జరుగుతుందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రయివేటు యాజమాన్యం చేతుల్లోకి వెళితే రిజర్వేషన్లు అమలు కావని తెలిపారు. మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి ఆమె భూపాలపల్లిలో ఆదివారం పర్యటించారు. పట్టణంలో బిఆర్ఎస్, జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో కవిత మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మే పనిలో ఉందన్నారు. సింగరేణి సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటుపరం కాకుండా అడ్డుకొని తీరుతామని, ఇందుకు కార్మికుల మద్దతు కావాలని కోరారు. సింగరేణి సంస్థలో ఉన్న ఉద్యోగాలను కేవలం 20 వేలకు కుదించి సంస్థను నిర్వీర్యం చేసి ప్రయివేటీకరణ చేయాలనే కుట్రలను తిప్పికొట్టామని గుర్తుచేశారు. రెండు మూడేళ్లకు రిటైర్డ్ అయ్యే కార్మికులందరినీ చేరదీసి వాళ్ల పిల్లలందరికీ దాదాపు 18వేల మందికి ఉద్యోగాలిచ్చామని తెలిపారు. అంటే ఈ 18 వేల మందితో ఇంకా 30 ఏళ్లు సింగరేణికి ఢోకా ఉండదని అన్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు ఇస్తామని సిఎం కెసిఆర్ ప్రకటిస్తే.. కోర్టుకు వెళ్లి అడ్డుకున్నవారెవరో గుర్తుపెట్టుకోవాలని కార్మికులకు సూచించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అన్ని రకాల పదవుల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కోల్ ఇండియా కంటే సింగరేణిలోనే వేతనాలు అధికమని తెలిపారు. సింగరేణి సౌకర్యాలు దేశమంతా అమలవ్వాలని, దేశంలోని బొగ్గుగని కార్మికులందర్నీ ఏకం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ పర్యటన సందర్భంగా ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే గండ్రా వెంకటరమణారెడ్డి అనుచరులు పోటాపోటీగా నినాదాలు చేశారు.

గణతంత్ర పరేడ్ శకటంగా 'ప్రభల తీర్థం'

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

74వ గణతంత్ర వేడుకలకు రాష్ట్రం నుంచి 'ప్రభల తీర్థం - మకర సంక్రాంతికి వ్యవసాయదారుల పండుగ' ఇతివృత్తంతో శకటాన్ని ప్రదర్శించనున్నారు. గణతంత్ర దినోత్సవ పరేడ్-2023లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన ఈ శకటాన్ని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. రాష్ట్ర సంప్రదాయాలను, కళలను ప్రతిబింబించేలా ఈ శకటాన్ని తీర్చిదిద్దారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోనసీమ ప్రజలు 'ప్రభల తీర్థం' సాంప్రదాయాన్ని శోభాయమానంగా నిర్వహించుకోవడం పరిపాటి. కోనసీమలో 450 సంవత్సరాలుగా ఈ సాంప్రదాయం కొనసాగుతోంది. ప్రజలందరూ సుఖసంతోషాలతో, భోగభాగ్యాలతో, చక్కని పాడిపంటలతో తులతూగాలని కాంక్షిస్తూ 'ప్రభల తీర్థం' పండుగను ప్రతియేటా సంక్రాంతి కనుమ రోజు నిర్వహిస్తున్న సంగతి విదితమే.

సబ్‌ప్లాన్ కొనసాగింపుపై సిపిఎం హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్సి, ఎస్టి సబ్‌ప్లాన్‌ను కొనసాగించడంపై సిపిఎం రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సబ్‌ప్లాన్‌ను కొనసాగించాలని 40 రోజుల క్రితమే సిఎంకు తమ పార్టీ లేఖ రాసిందని గుర్తుచేశారు. కెవిపిఎస్ సహా అనేక దళిత, గిరిజన సంఘాలు, ఇతర ప్రజాసంఘాలు సబ్‌ప్లాన్ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేశాయని వివరించారు. అయితే ఈ ఆర్డినెన్సును అసెంబ్లీలో చట్టరూపంలో తీసుకురావాల్సి ఉందని, ఆ సమయంలో పాత చట్టంలో ఉన్న లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. నిర్దిష్ట గడువుతో నిమిత్తం లేకుండా సమాజంలోని అన్ని తరగతులతో పాటు ఎస్సి, ఎస్టిలు, వారి నివాసిత ప్రాంతాలు సమానంగా అభివృద్ధి అయ్యేదాకా ఈ చట్టం కొనసాగాలని కోరారు. ముందు సంవత్సరం కేటాయించిన నిధులు ఖర్చు కాకుండా మిగిలిపోతే వాటిని ఆ తదుపరి ఏడాది నిధులలో కలిపే విధంగా చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా చట్ట భద్రత కల్పిస్తూ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం కూడా ఇందుకోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు.

సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి : కాంగ్రెస్

సబ్‌ప్లాన్ చట్టం పొడిగిస్తూ ఆర్డినెన్సు తీసుకురావడం పట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా నిలిపివేసిన 27 సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఎస్సి, ఎస్టి స్పెషల్ డెవలప్‌మెంట్ పేరుతో కట్టుదిట్టమైన చట్టం తీసుకొచ్చి ఎస్సి, ఎస్టిలకు కేటాయించే నిధులను దారి మళ్లించకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు తగిన సవరణలతో చట్టాన్ని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కోరారు.

పోరాట ఫలితమే : కెవిపిఎస్

సబ్‌ప్లాన్ కొనసాగింపు కోసం అనేక దళిత, గిరిజన, ప్రజాసంఘాలు కలుపుకుని ఉద్యమాలు, ఆందోళనలు చేసిన ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ఇచ్చిందని కెవిపిఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పాత చట్టంలో ఉన్న లోపాలను సరిదిద్ది ఆర్డినెన్సును అసెంబ్లీలో చట్టరూపంలో తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కెవిపిఎస్ పిలుపు మేరకు సబ్‌ప్లాన్ కొనసాగింపు కోసం నిర్వహించిన ఉద్యమంలో పాల్గొన్న వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. చట్టం కొనసాగింపు కోసం జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసనలను చేపట్టాలని గతంలో ఇచ్చిన పిలుపును ఆర్డినెన్స్ నేపథ్యంలో విరమించుకున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

శాస్త్రీయ ప్రచారాన్ని ముమ్మరం చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి - కడప అర్బన్

జెవివి శాస్త్రీయ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాల్సిన అవసరముందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. ఈ ఏడాది యుఎన్ఒ మిల్లెట్ ఏడాదిగా ప్రకటించిందని చెప్పారు. ఆదివారం జయరాజ్ గార్డన్‌లో రాష్ట్ర చెకుముకి సైన్స్ సంబరాలు ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఇలాంటి సైన్స్ సంబరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు ఇందులో మరింత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జెవివి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్ రాహులు, మురళీధర్ మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా శాస్త్రీయ ఆలోచన విధానాలపై జెవివి పనిచేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 45 టీముల నుంచి 150 మంది విద్యార్థులు భాగస్వాములయ్యారని తెలిపారు. మూఢనమ్మకాల నుంచి ప్రజలను దూరం చేయడమే చెకుముకి సైన్స్ సంబరాల లక్ష్యమని చెప్పారు. సైన్స్ కార్యకర్తలు 110 మంది, సైంటిస్టులు, ప్రొఫెసర్లు 30 మంది, జివివి కార్యకర్తలు 70 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరయ్యారని చెప్పారు. మొదటిరోజు రాష్ట్ర నుంచి వచ్చిన విద్యార్థులకు క్విజ్ పోటీలు, విజువల్ రౌండ్స్, మీట్ ద సైంటిస్ట్, సాంస్కృతి కార్యక్రమాలు, రెండవ రోజు రాత పరీక్ష, రౌండ్ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి బి వెంకటసుబ్బయ్య, ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి శ్రీనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు, రాష్ట్ర కార్యదర్శి కుర్ర రామారావు, దాతలు డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, నారాయణరెడ్డి, బాల ఎల్లారెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ, తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, కడప, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికుల జీవనంపై కేంద్రం దాడి

మొదటి పేజీ తరువాయి

సంస్థలను విధ్వంసం చేస్తోన్న తీరుపై ప్రజలకు వివరిస్తామన్నారు. 'దేశాన్ని రక్షించుకుందాం' అనే నినాదంతో ముందుకు సాగుతామని తెలిపారు. సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత మాట్లాడుతూ బిజెపి డబుల్ ఇంజిన్ సర్కారు అని చాలా రాష్ట్రాల్లో ఉందని, ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో కార్మికుల హక్కులపై దాడి జరుగుతోందని అన్నారు. మరోవైపు కేరళలోని వామపక్ష ప్రభుత్వం కార్మికులకు అండగా నిలుస్తున్న విషయాన్ని గమనించాలని కోరారు. కార్మికులకు ఎప్పుడూ అండగా నిలిచేది ఎర్ర జెండాయేనని తెలిపారు. వామపక్ష భావజాల ప్రభుత్వాలు రావాల్సిన అవసరం ఉందని, అందుకు కార్మికవర్గం తమ వంతు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కి చెప్పారు.

సిఐటియు కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీనాక్షి సుందరం మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఒక్కసారి కూడా ఇండియన్ లేబర్ కమిషన్ సమావేశాలను నిర్వహించలేదని, దీనిని బట్టే కార్మికవర్గంపై వారికున్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోందని తెలిపారు. కర్ణాటకలో 40 శాతం కమీషన్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. కార్మికులకు అండగా నిలబడని బొమ్మై ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతారన్నారు. కార్మిక పోరాటాలకు కాంగ్రెస్, జెడిఎస్ అండగా నిలబడాలని కోరారు. సిఐటియు కర్ణాటక రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వరలక్ష్మి మాట్లాడుతూ అఖిల భారత మహాసభ విజయవంతంలో కీలకపాత్ర పోషించిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ కార్మికులకు ఒక్క మేలు కూడా చేయలేదని విమర్శించారు. కర్ణాటక భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హిమంతోశ్ నాయకులను వేదికపైకి ఆహ్వానించారు. వేదికపై అంగన్‌వాడీలు డ్రమ్స్ వాయించారు. కోలాటం ఆడారు. చిన్నపిల్లలు నృత్యప్రదర్శన చేశారు. పాటలు పాడారు. ఈ సభలో సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు ఎకె పద్మనాభన్, సిహెచ్.నర్సింగరావు, చుక్క రాములు, జి.బేబీరాణి, కార్యదర్శులు పాలడుగు భాస్కర్, కె.ఎన్.ఉమేశ్, కరుమలయన్, ఉషారాణి, ఎఆర్ సింధు, ఆల్ ఇండియా కిసాన్ సభ కోశాధికారి కృష్ణప్రసాద్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - కారంపూడి (పల్నాడు జిల్లా)

అప్పుల బాధతో యువ కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా కారంపూడి మండలం శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన కౌలు రైతు చెన్నూరి కొండలు (33) పదేళ్లుగా కౌలు వ్యవసాయం చేస్తున్నారు. ప్రతిఏటా 15-20 ఎకరాలు సాగుచేస్తుండేవారు. ఈ ఏడాదీ 22 ఎకరాలు కౌలుకు తీసుకుని రెండెకరాల్లో పత్తి, రెండెకరాల్లో మిర్చి, 18 ఎకరాల్లో వరి సాగు చేశారు. వీటన్నింటికీ పెట్టుబడి కోసం రూ. 12 లక్షల వరకూ అప్పులు చేశారు. దిగుబడి సరిగా లేకపోవడంతో అప్పులు తీరే మార్గం లేక మనస్తాపం చెందారు. పొలానికి అవసరమనే పేరుతో పురుగు మందును శనివారం కొని తెచ్చి కుటుంబీకులంతా నిద్రపోయాక దాన్ని తాగారు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబీకులు స్థానిక ఆర్‌ఎంపి వద్దకు తీసుకెళ్లి కక్కించి అనంతరం నరసరావుపేట ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా మార్గం మధ్యలోనే మృతి చెందారు. దీంతో మృతదేహాన్ని గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కొండలుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

టిడ్కో గృహాలు అప్పగించకపోవడం దుర్మార్గం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

టిడ్కో గృహాలను నాలుగేళ్లయిన వైసిపి ప్రభుత్వం లబ్ధిదారులకు అప్పగించకపోవడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లా ప్యాపిలి మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. వైఎస్ జగన్ ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు తాను అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి తీసుకోకుండా లబ్ధిదారులందరికీ టిడ్కో గృహాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి ఎ.శేఖర్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమరావతి రైతుల పాదయాత్ర

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అమరావతిని రాజధానిగా కొనసాగించాలని కోరుతూ అమరావతి జెఎసి ఆధ్వర్యాన రైతులు చేపట్టిన అమరావతి నుంచి అరసవల్లి వరకు పాదయాత్ర ఆదివారంతో ముగిసింది. గతేడాది పాదయాత్ర ఆగిపోయిన చోట నుంచి ఈనెల 11న అమరావతి జెఎసి కో కన్వీనర్ గద్దె తిరుపతిరావు కాలినడకన అరసవల్లికి బయలుదేరారు. శనివారం రాత్రికి శ్రీకాకుళం చేరుకున్న ఆయన ఆదివారం ఉదయం అరసవల్లిలో సూర్యనారాయణ స్వామి దర్శనం చేసుకున్నారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి అరసవల్లి వరకు టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఇతర నాయకులతో కలిసి ఆయన పాదయాత్రను పూర్తి చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు రాజధాని లేకుండా చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడుముక్కలాట ప్రారంభించి మూడున్నరేళ్ల పాటు కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతి నిర్మాణమే తమ ధ్యేయమన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనం కోసం రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులు శాంతియుతంగా పాదయాత్ర చేస్తుంటే విచ్ఛిన్నం చేసి అడ్డంకులు సృష్టించారని దుయ్యబట్టారు. అమరావతి నుంచి అరసవల్లికి పాదయాత్రగా వస్తే రైతులపై ప్రభుత్వ దమనకాండ, పోలీసులు అనుసరించిన వైఖరిని ప్రజలు గమనించారని పేర్కొన్నారు. అమరావతిని రాజధానిగా కొనసాగించి, దానిపై వచ్చిన ఆదాయంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలని కోరారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ రాజధానులను మార్చడం సరికాదన్నారు.

అరసవల్లికి చేరుకున్న అమరావతి జెఎసి కో కన్వీనర్ తిరుపతిరావు

ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులకు విద్యార్హతా పరీక్షలు

ఆశా వర్కర్లకు పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పాడేరు టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఆదివారం ఎపి ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా విద్యార్హతా పరీక్షలు నిర్వహించారు.

రంపచోడవరంలో ఒకటి, పాడేరు పట్టణంలో ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని డిఇఒ కార్యాలయ అధికారులు తెలిపారు. 1588 మందికిగాను 1444 మంది పరీక్షలకు హాజరయ్యారని, 144 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. పరీక్షలకు పలువురు ఆశాలు తమ మనుమలు, మనుమరాళ్ల సహాయంతో రావడం కనిపించింది. కొంతమంది చంటి బిడ్డలతో సహా పరీక్షా కేంద్రాలకు హాజరయ్యారు. ఏళ్ల కాలం నుంచి పనిచేస్తున్న తమకు ఇప్పుడు పరీక్షలు నిర్వహించడం ఏంటని పలువురు నిట్టూర్చారు. తమకీవయసులో పరీక్షలు ఎందుకు నిర్వహిస్తున్నారో కూడా తెలియదని, రాయకుండే ఉద్యోగాలు పోతాయేమోనని భయపడి వచ్చామని కొందరు సీనియర్ వర్కర్లు వాపోయారు. పరీక్షల పేరిట తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. పాడేరులోని పరీక్షా కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సి జమాల్‌బాషా పరిశీలించారు. ఆశా వర్కర్లు, సిహెచ్‌డబ్ల్యులు కచ్చితత్వంతో ఆరోగ్య సేవలు అందించేందుకు చదువు అవసరమని ప్రభుత్వాలు భావించి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అర్హత సాధిస్తే సర్టిఫికెట్లు అందిస్తామన్నారు.

అదృశ్యమైన చిన్నారి అనుమానాస్పద స్థితిలో మృతి

ప్రజాశక్తి - నరసరావుపేట (పల్నాడు జిల్లా)

నరసరావుపేటలో శనివారం అదృశ్యమైన పది నెలల భానుప్రకాశ్ ఆదివారం విగతజీవిగా కనిపించాడు. ఎదురింటి బావిలో బాలుని మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డిపేట బ్యాంక్ కాలనీకి చెందిన బండి వాసు, సాయిలక్ష్మి దంపతుల కుమారుడైన భానుప్రకాష్ శనివారం సాయంత్రం నుంచి అదృశ్యమయ్యాడు. బాలుడు కిడ్నాప్ అయినట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతంలోని బావులు, డ్రెయినేజీ కాల్వలు, నీటి తొట్లలో గాలించారు. ప్రస్తుతం బాలుని మృతదేహం ఉన్న బావిలోనూ శనివారం రాత్రి పది గంటల వరకూ పరిశీలించినా ఏమీ కనిపించలేదు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలప్పుడు బావి సమీపంలో పిట్టగోడపై కూర్చుని మాట్లాడుకుంటున్న కుటుంబీకులకు ఎందుకో అనుమానంతో బావి వద్దకెళ్లి లైటు వేసి చూడగా బాలుని మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ సిఐ భక్తవత్సలరెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని బాలుని మృతదేహాన్ని వెలికి తీయించి స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సిఐ స్పందిస్తూ మృతదేహంపై చిన్నచిన్న గాయాలున్నాయని, అవి బావిలో పడేటప్పుడు అయ్యాయా? ముందగానే ఎవరైనా గాయపరిచారా? అనే విషయాలు పోస్టుమార్టం అనంతరం తెలుస్తాయని చెప్పారు. ప్రస్తుతానికి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా బిడ్డను తల్లి పిట్టగోడపై కూర్చోబెట్టి ఆడిస్తున్న సందర్భంలో చేయిజారి పడిపోయి ఉంటాడని, సాయిలక్ష్మి మానసిక పరిస్థితి సరిగా ఉండదని కుటుంబీకులు అనుకోడంతో వాగ్వాదాలు తలెత్తాయి. ఈ విషయాలు సోషల్ మీడియాలోనూ రావడంతో బాలుని తండ్రి వాసు స్పందించారు. తన భార్య మానసిక స్థితి బాగానే ఉందని, బిడ్డలను బాగా చూసుకుంటుందని చెప్పారు. మృతికిగల అసలు కారణాలను పోలీసులే తేల్చాలన్నారు.

సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించడానికి, పోరాడటానికి, ఓడించడానికి ఇదే తరుణం

ఆర్. అరుణ్ కుమార్

అమెరికా సామ్రాజ్యవాదం ఒక్క క్యూబా సమస్య మాత్రమే కాదు. ఇది మొత్తం మానవాళి సమస్య. అమెరికా విధానాలు ఒక్క క్యూబాకే కాదు, యావత్ మానవాళి మనుగడకే ముప్పు. 1966లో ఫైడెల్ క్యాస్ట్రో చేసిన ఒక ప్రసంగంలో ఇలా పేర్కొన్నారు. "ఇది క్యూబన్లకే కాదు, యావత్ మానవాళి ఎదుర్కొంటున్న సమస్య. ఈ విశ్వంలో మేమూ ఒక భాగం. మనకు ఎదురైన పరిస్థితినే ప్రపంచమూ ఎదుర్కొంటోంది. మన విజయం ప్రపంచ విజయం అని మనం ఎప్పటికీ మరచిపోరాదు. సామ్రాజ్యవాదంపై మనం సాధించిన విజయం ప్రపంచ విజయం. అంతేగాక, ఆ ప్రపంచం యొక్క ఓటమి మన ఓటమి...మన బానిసత్వం అవుతుంది"!

బ్రెజిల్ అధ్యక్షుడిగా లూయిస్ ఇనాసియో లూలా డ సిల్వా ప్రమాణ స్వీకారం చేసిన వారం రోజుల వ్యవధిలోనే, ఎన్నికల్లో ఓడిపోయిన జైర్ బోల్సనారో మద్దతుదారులు బ్రెజిల్ లోని మూడు ప్రభుత్వ విభాగాలపై దాడి చేశారు. రాజధాని నగరం బ్రసీలియా లోని శాసన, న్యాయ, కార్యనిర్వాహక భవనాలను వారు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన లూలా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్న వారి ప్రయత్నాన్ని ఫెడరల్ ప్రభుత్వం మొగ్గలోనే తుంచివేసింది.

జనవరి6, 2021న అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు చేసిన ప్రయత్నం లాంటిదే బ్రెజిల్‌లోనూ జరిగింది. బోల్సనారో, ట్రంప్ ఇద్దరూ ఆయా దేశాల అధ్యక్ష ఎన్నికల్లో తమ ఓటమిని అంగీకరించడానికి నిరాకరించారు. అంతేగాక, ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కేందుకు తమ మితవాద మద్దతుదారులను ప్రోత్సహించారు. విధ్వంసాన్ని లూలా తీవ్రంగా ఖండించారు. బ్రసీలియాకు వెళ్లిన విధ్వంసకారులకు డబ్బులిచ్చి ఎగదోసిన వారు ఎక్కడున్నా వెతికి పట్టుకుంటాం. వారు చట్టపరంగా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వుంటుంది' అన్నారు. అంతేగాక నరహంతకుడు బోల్సనారో తను ఆశ్రయం పొందిన ఫ్లోరిడా లోని మియామి నుండి సోషల్ మీడియా ద్వారా ఈ విధ్వంసాన్ని ఎగదోస్తున్నాడని లూలా పేర్కొన్నారు.

సరైన విచారణ జరిగి, లూలా చెప్పినట్లుగా, విధ్వంసకారులకు ఆర్థిక సాయం చేసినవారిని గుర్తించినట్లయితే, అది ఖచ్చితంగా చాలా విషయాలను స్పష్టం చేస్తుంది. ప్రధానంగా మితవాద శక్తులకు సామ్రాజ్యవాదానికి మధ్య ఉన్న సంబంధం బయటపడుతుంది. బ్రెజిల్‌లో జరిగిన కుట్ర వెనుక సిఐఎ, అమెరికా, దాని మానస పుత్రుల హస్తం ఉందని తేలినా ఆశ్చర్యపోనక్కర్లేదు. నిజానికి, లాటిన్ అమెరికాలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన వామపక్ష, ప్రగతిశీల ప్రభుత్వాలను అస్థిరపరిచే అన్ని కుతంత్రాల వెనుక అమెరికా ప్రమేయముందన్నది తెలిసిన విషయమే.

లాటిన్ అమెరికాలో తన రాజకీయ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి అమెరికా సహాయ కార్యక్రమాలను చేపడుతుంటుంది. వికీలీక్స్ ప్రచురించిన అనేక ప్రభుత్వ రికార్డులలో చూపినట్లుగా... మితవాద మిత్రపక్షాలు తిరిగి ఎన్నికయ్యేలా అమెరికన్ ప్రభుత్వం సహాయ కార్యక్రమాలను చేపట్టింది. వివిధ దేశాల్లోని ఎన్‌జివో లకు అమెరికా నిధులు సమకూరుస్తుంది. తను ఎంపిక చేసుకున్న అభ్యర్థిని ఎన్నుకోవడంలో విఫలమైనట్లయితే, అక్కడి ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు కుట్రలు, కుతంత్రాలు పన్నుతుంది. దీని కోసమే అమెరికా 1983లో 'నేషనల్ ఎండోమెంట్ ఫర్ డెమోక్రసీ' (ఎన్‌ఇడి) అనే సంస్థను సృష్టించింది. ఇది యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యుఎస్ ఎయిడ్)తో పాటుగా అమెరికా ప్రభుత్వ జోక్యందారీ విధానాలకు ఆర్థిక విభాగంగా పనిచేస్తుంది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ముసుగు తగిలించుకున్న ఈ రెండు ఎన్జీవోలు...వాస్తవానికి అమెరికా ప్రయోజనాలకు లొంగని ప్రభుత్వాలను అస్థిరపరచడానికి అవసరమైన ఆర్థిక సహాయం చేస్తుంటాయి.

పాతిక సంవత్సరాల క్రితం సిఐఎ చేసినవే తాము చేస్తున్నామని...ఎన్‌ఇడి స్థాపకుడు అలాన్ వీన్‌స్టెయిన్ 'ది వాషింగ్టన్ పోస్ట్' (1991)కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సూటిగా చెప్పాడు. కాబట్టి ఎన్‌ఇడిని ప్రపంచవ్యాప్తంగా 'రెండవ సిఐఎ' అని పిలుస్తారు. 2020లో ఎన్‌ఇడి తన సొంత వెబ్‌సైట్‌లో వివరించినట్లుగా...అత్యంత నిరంకుశ పాలక దేశాలుగా అది భావించే క్యూబా, నికరాగువా, వెనిజులాలో 'ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి'...సంస్థ 'సాయం' చేస్తుంటుంది.

అస్థిరపరిచే చర్యలు

గత సంవత్సరం లాటిన్ అమెరికాలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అనేక ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు అమెరికా జోక్యం చేసుకోవడాన్ని మనం చూశాం.

అర్జెంటీనాలో మితవాద మాక్రి స్థానంలో అల్బెర్టో ఫెర్నాండెజ్ నేతృత్వంలో ప్రజానుకూల ప్రభుత్వం ఏర్పడినప్పుడు...వారు మొదట ఉపాధ్యక్షురాలు క్రిస్టినా కిర్చెనర్‌పై హత్యాయత్నం చేశారు. అది విఫలం కావడంతో...గుత్తాధిపత్య మీడియా, ధనస్వాముల వైపు మొగ్గు చూపే న్యాయ వ్యవస్థ లోని ఒక విభాగం స్పాన్సర్ చేసిన మితవాదులు...ఆమెను జైలులో పెట్టడానికి, ప్రభుత్వ పదవిలో కొనసాగేందుకు ఆమెకు గల హక్కును హరించడానికి అబద్ధాలను వండి వార్చారు. ప్రజానుకూల పాలనను అస్థిరపరిచేందుకు యుఎస్‌ఎయిడ్, ఇతర అనేక అమెరికన్ సంస్థలు ఆ దేశంలో చురుకుగా పాల్గొంటున్నాయి.

అదే సమయంలో పెరూ అధ్యక్షుడిగా ప్రజలెన్నుకున్న వామపక్ష ఉపాధ్యాయుడు, ట్రేడ్ యూనియన్ నాయకుడు పెడ్రో కేస్టిల్లోను పదవి నుంచి తప్పించారు. కాస్టిల్లోపై అవినీతి ఆరోపణలు చేసిన ముగ్గురు న్యాయమూర్తులు ఎటువంటి సాక్ష్యాలు లేకుండానే తమ తీర్పు ద్వారా ఆయనను పదవి నుంచి తొలగించారు. కేస్టిల్లోని జైలు పాల్జేసి మితవాదులు అధ్యక్ష పదవిని చేపట్టారు. ప్రజాస్వామ్య హక్కులను పునరుద్ధరించాలని, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడు కాస్టిల్లోకి తిరిగి పాలనా పగ్గాలు అప్పగించాలని డిమాండ్ చేస్తున్న ప్రజా నిరసనలను క్రూరంగా అణిచివేశారు.

ఈ సంఘటనలకు ముందు బొలీవియాలో ఎన్‌ఇడి తిరుగుబాటును ప్రేరేపించింది. దాంతో అధ్యక్షుడు ఇవో మొరేల్స్ రాజీనామా చేసి ప్రవాసంలోకి వెళ్ళవలసి వచ్చింది. 2013-2018 మధ్య ప్రతిపక్ష పార్టీలకు, మితవాద రాజకీయ ప్రముఖులకు, మొరేల్స్ వ్యతిరేకులకు ఎన్‌ఇడి, యుఎస్‌ఎయిడ్ ఏడు కోట్ల అమెరికన్ డాలర్లను అందించాయి.

ఈక్వెడార్‌లో గొప్ప ప్రజాదరణ పొందిన మాజీ అధ్యక్షుడు రఫేల్ కొరియా ప్రగతిశీల కూటమిని తుడిచిపెట్టడానికి వేట కొనసాగుతోంది. ఆయన దేశ బహిష్కరణకు గురయ్యాడు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడిగా పనిచేసిన జార్జ్ గ్లాస్ అరెస్టయ్యాడు.

మాజీ ఫ్రెంచ్ రాయబారి ప్రకారం అమెరికా, ఫ్రాన్స్ రెండూ హైతీలో తిరుగుబాటును "సమర్థవంతంగా నిర్వహించాయి". ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడు జీన్-బెర్ట్రాండ్ అరిస్టైడ్‌ను తొలగించడానికి...2001 ఫిబ్రవరిలో హైతీకి చెందిన ఐఆర్ఐ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ స్టాన్లీ లూకాస్...స్థానిక రేడియో కార్యక్రమంలో మూడు మార్గాలను బహిరంగంగా ముందుకు తెచ్చారు. 'ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించడానికే అని చెప్పినా, విధ్వంసక కార్యకలాపాలను ప్రోత్సహించడంలో ఐఆర్ఐ చురుగ్గా పాల్గొంటున్నది.

ఎన్‌ఇడి 1983లో ఉనికి లోకి వచ్చిన వెంటనే చేసిన ఘనకార్యాలలో ఒకటి నికరాగువాలో అమెరికా అనుకూల రాజకీయ శక్తులకు మద్దతు ఇవ్వడం. ఎన్‌ఇడి ఇప్పటికీ నికరాగువా లోని ప్రతిపక్షాలు, మితవాద మీడియా సంస్థలకు నిధులు అందజేస్తూనే వుంది. పబ్లిక్ రికార్డుల ప్రకారం, 2016-2019 మధ్య మీడియా సంస్థలతో సహా నికరాగువా వ్యతిరేక సమూహాలకు ఎన్‌ఇడి కనీసం 4.4 మిలియన్ అమెరికా డాలర్లను అందించింది. 2018లో నికరాగువాలో తిరుగుబాటుకు జరిగిన యత్నంలో ఈ శక్తులు కీలక పాత్ర పోషించాయి.

అదేవిధంగా, వెనిజులాలో మదురో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఎన్‌ఇడి కోట్ల డాలర్లను తగలేస్తోంది. మదురో స్థానంలో ప్రతిపక్ష నాయకుడు జువాన్ గైడోను 'వెనిజులా అధ్యక్షుడి' గా అమెరికా ప్రకటించడాన్ని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వద్ద పని చేసిన జాతీయ భద్రత మాజీ సలహాదారు జాన్ బోల్టన్ చెప్పారు. సిఎన్‌ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో 2018లో వెనిజులాలో తిరుగుబాటుకు జరిగిన కుట్రలో అమెరికా పాత్ర గురించి సూటిగా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, మదురోను గైడో స్థానంలో అధ్యక్షునిగా పెట్టేందుకు తాము ప్రయత్నించామని చెప్పారు.

ఈ ప్రాంతంలో అమెరికా ప్రధాన లక్ష్యం క్యూబా. చాలా కాలంగా అమెరికా చొరబాట్లు, విధ్వంసక చర్యల కారణంగా ఆ దేశం తీవ్రంగా నష్టపోయింది. క్యూబాను లక్ష్యంగా చేసుకున్న కార్యక్రమాలకు ఎన్‌ఇడి, యుఎస్‌ఎయిడ్ గత 20 సంవత్సరాలుగా దాదాపు 25 కోట్ల అమెరికన్ డాలర్లను వెచ్చించాయి. ఎన్‌ఇడి వెబ్‌సైట్ ప్రకారం ఇది 2020 ఒక్క ఏడాదిలోనే 42 క్యూబా వ్యతిరేక కార్యక్రమాలకు నిధులు సమకూర్చింది. 2021లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల మనోభావాలను ప్రేరేపించడానికి, సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారాన్ని రూపొందించడానికి, వ్యాపింపజేయడానికి క్యూబా వ్యతిరేక శక్తులకు ఎన్‌ఇడి నిధులు అందించింది.

ఆంక్షలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నియంత్రణ, వాణిజ్య విధానం, సహాయ కార్యక్రమాల ద్వారా వివిధ దేశాల ఆర్థిక రాజకీయ పథాలను ప్రభావితం చేయడానికి అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఇవన్నీ తన విదేశాంగ విధాన లక్ష్యాలను సాధించడానికే అమలు చేయబడ్డాయి.

క్యూబాపై దురాక్రమణపూరిత దాడి

క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా ప్రభుత్వం దురాక్రమణకు పాల్పడుతోంది. క్యూబాపై చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా అమెరికా అమలు చేసే నేరపూరిత ఆర్థిక దిగ్బంధనాన్ని అందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. అమెరికా 1962 నుండి క్యూబాపై దాదాపు పూర్తి నిషేధాన్ని కొనసాగిస్తోంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఓటింగ్ ద్వారా అంతర్జాతీయ సమాజం ఈ దిగ్బంధనాన్ని 29 సార్లు ఖండించింది. అమెరికా విధించిన ఈ ఆర్థిక దిగ్బంధనం వల్ల క్యూబాకు 15,421 కోట్ల డాలర్లు (ప్రస్తుత రేట్ల ప్రకారం) నష్టం వాటిల్లింది. లక్షా 39,111 కోట్ల విలువైన బంగారం విదేశీ బ్యాంకుల్లో చిక్కుకుపోయింది. క్యూబా ప్రజలను తీవ్ర ఇక్కట్లపాల్జేసి, గందరగోళ పరిచి, ప్రభుత్వ మార్పునకు వారిని ప్రేరేపించాలన్న దుష్ట పన్నాగంలో భాగంగానే అమెరికా ఈ ఆంక్షలను విధించింది.

సరి కొత్త ఆంక్షలతో దిగ్బంధనాన్ని మరింత కఠినతరం చేయడానికి అమెరికా ప్రభుత్వం (ట్రంప్, బైడెన్ హయాంలో) కోవిడ్ కాలంలో (2020, 2021) ప్రయత్నించింది. మందులు, శ్వాస సంబంధ పరికరాలు, ఇంధనం, ఇతర ఆర్థిక వనరుల దిగుమతిని అడ్డుకుంది. ప్రాణ రక్షక ఔషధాలు, వైద్య పరికరాల దిగుమతులను నిరోధించడంతో క్యూబా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడింది. క్యూబా తయారుచేసిన కోవిడ్ వ్యాక్సిన్లు 90 శాతం పైగా ప్రభావవంతంగా పని చేస్తున్నాయని నిరూపితమైనప్పటికీ డబ్ల్యుహెచ్ఒ వాటిని గుర్తించకుండా మరోసారి తిరస్కరించింది. దిగ్బంధనం వల్ల ఉత్పత్తులు, ఆహారం, సేవల ద్రవ్యోల్బణంతో క్యూబా ఇబ్బందులు పడుతోంది. విద్యుత్ సరఫరా సమస్యలు ఏర్పడుతున్నాయి. వలసలు పెరుగుతున్నాయి.

జాతీయ విముక్తి ఉద్యమాలకు తన మద్దతు, సహాయాన్ని అందించడం, వారి ప్రసిద్ధ విద్యాసంస్థల్లో నిపుణులకు శిక్షణ ఇవ్వడం, వైద్య సిబ్బందిని పంపడం, అత్యంత ప్రభావవంతమైన కోవిడ్-19 వ్యాక్సిన్లతో పాటు మందులను ఎగుమతి చేయడం ద్వారా క్యూబా వీరోచిత పాత్రను పోషిస్తోంది. బలమైన సామ్రాజ్యవాద దేశానికి కూత వేటు దూరంలో ఉన్న చిన్న దేశం నుండి ఊహించిన దానికంటే ప్రపంచంలో క్యూబా పాత్ర వెయ్యి రెట్లు ఎక్కువగా వుంది. అందువల్ల క్యూబా అమెరికా ఆధిపత్యానికి ప్రతిఘటనా చిహ్నంగా ఉంది.

అమెరికా సామ్రాజ్యవాదం ఒక్క క్యూబా సమస్య మాత్రమే కాదు. ఇది మొత్తం మానవాళి సమస్య. అమెరికా విధానాలు ఒక్క క్యూబాకే కాదు, యావత్ మానవాళి మనుగడకే ముప్పు. 1966లో ఫైడెల్ క్యాస్ట్రో చేసిన ఒక ప్రసంగంలో ఇలా పేర్కొన్నారు. "ఇది క్యూబన్లకే కాదు, యావత్ మానవాళి ఎదుర్కొంటున్న సమస్య. ఈ విశ్వంలో మేమూ ఒక భాగం. మనకు ఎదురైన పరిస్థితినే ప్రపంచమూ ఎదుర్కొంటోంది. మన విజయం ప్రపంచ విజయం అని మనం ఎప్పటికీ మరచిపోరాదు. సామ్రాజ్యవాదంపై మనం సాధించిన విజయం ప్రపంచ విజయం. అంతేగాక, ఆ ప్రపంచం యొక్క ఓటమి మన ఓటమి...మన బానిసత్వం అవుతుంది"!

క్యూబన్లు ఈ ఆలోచనలను పూర్తిగా ఇంకించుకున్నారు. మనం కూడా అదేవిధంగా ఇంకించుకోవాలి. మన భవిష్యత్తు ప్రపంచ భవిష్యత్తుతో బాగా పెనవేసుకుని ఉన్నందున ఇది అత్యంతావశ్యకం. మితవాద శక్తులకు వ్యతిరేకంగా మన పోరాటం...మితవాద దాడితో పోరాడుతున్న అన్ని శక్తులను బలోపేతం చేసేందుకు తోడ్పడుతుంది. మితవాద శక్తులను ఓడిస్తే అది ప్రగతిశీల శక్తులను బలోపేతం చేయడమే కాదు, సామ్రాజ్యవాదాన్ని బలహీనపరచడానికి కూడా తోడ్పడుతుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘీభావం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మన పోరాటంలో ఒక భాగం. పైగా ఇది మనకు మాత్రమే కాదు, మొత్తం ప్రపంచానికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ అవగాహనతోనే మితవాద దాడికి వ్యతిరేకంగా మన పోరాటాన్ని సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంతో జోడించాలి.

/ వ్యాసకర్త : సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు /

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
31-31-21, Ground & 1st Floor, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, Andhra Pradesh.

O.A. 499/2020

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

Bank of India, Guntur
Vs
M/s. Sri Lakshmi Ganapathi Digitals

To
1. **M/s. Sri Lakshmi Ganapathi Digitals,** a Proprietary Firm, Rep. by its Proprietor, Sri Nelluri Kondala Rao, S/o Chinnapichaiah, D.No: 6-5-73, 5th line, 2nd cross Road, Arundalepet, Guntur-522003.
2. **Sri Nelluri Kondala Rao, S/o Chinnapichaiah,** Hindu, residing at D.No: 4-8-125, Sakhethapuram, Koretipadu, Guntur-522007.

SUMMONS TO DEFENDANTS BY WAY OF PAPER PUBLICATION

WHEREAS OA/ 499/2020 was listed before Hon'ble Presiding Officer/Registrar on 25.01.2023.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs. 29,40,143/- (application along with copies of documents etc., annexed).
In accordance with sub-section (4) of Section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties:
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer / Registrar on **25.01.2023** at 10:30 A.M. failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this 29th day of December 2022.
Signature of Officer Authorized to issue Summons
Debts Recovery Tribunal, Visakhapatnam

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
సంప్రదించాల్సిన చిరునామా: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిసుల బిజినెస్ పార్క్, గన్‌పత్రావ్ కదం మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400013, సంప్రదించాల్సిన నం.(022) 61827414, (022) 61827375.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

ఏదైతే, క్రింది సంతకందారు **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను చెల్లించవలసిందిగా రుణగ్రహీతలను కోరుతూ సదరు తేదీన డిమాండ్ నోటీసును జారీచేశారు.
రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులకు ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూలు 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంచేసుకున్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లా వాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, డిమాండ్ నోటీసు తేది నుండి దిగువ పేర్కొన్న మొత్తాలను దానిపై వడ్డీ& పెనల్ వడ్డీ, చార్జీలు, ఖర్చులు మొ॥వాటితోపాటు **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** కు చెల్లింపులచేయు నిమిత్తం ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్ ను విడిపించు కొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబందించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాల పై రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

రుణ ఖాతా నం.	బాధ్యులు/చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధుల పేరు	డిమాండ్ నోటీసు తేది & మొత్తాలు	స్వాధీనతా తేది
10124413	శ్రీ ఎస్. కోటేశ్వర రావు (రుణగ్రహీత) శ్రీమతి ఎస్. పుష్పలత (సహ-రుణగ్రహీత)	12.10.2022నాటికి రూ.20,72,293/- (రూపాయలు ఇరువై లక్షల డెబ్బై రెండు వేల రెండు వందల తొంబై మూడు మాత్రమే)	19.01.2023

షెడ్యూలు ఆస్తి: రిజిస్టర్డు సేల్ డీడ్ నం.12939/2017 ఆధారంగా శ్రీ సంకబత్తుల కోటేశ్వర రావు పేరున ఉన్న కృష్ణా జిల్లా, ఎస్ఆర్ఓ జగ్గయ్యపేట పరిధిల్లో వస్తవయి మండలం, భీమవరం గ్రామం& గ్రామపంచాయతీ లోగల రెఫరెన్స్ ఆర్.సి.నం.సిఎఫ్‌జి5-10/2013 తేది: 02.04.2015, టిఎల్‌పి నం.141/2015/ఆర్, ప్లాట్ నం.లు125, 126, 127తో ఆమోదిత డి.టి.సి.పి.లేఔట్ నం.3217/138/2015/ఆర్3 ప్రకారం ఆర్.ఎస్.నం.లు 327/1బి, 2,3,328/1(పి), 2ఎ1, 2ఎ2, 2బి మరియు 330/2ఎ(పి)& 327/2లో ఎక.2.00సెంట్లు యొక్క 516చ.గ.ల విస్తీర్ణం యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **తూర్పు:** 33-0అ.ల వెడల్పు రోడ్డు, 99-0అ.లు, **దక్షిణం:** ప్లాట్ నం.124 47-0అ.లలో ఆస్తి, **పడమర:** ప్లాట్ నం.లు138, 137, 136 99-0అ.లలో ఆస్తి., **ఉత్తరం:** ప్లాట్ నం.128 47-0అ.ల్లో ఆస్తి, ఈసరిహద్దుల్లో 516చ.గ.లు లేదా 431.443చ.మీ.ల విస్తీర్ణంతో ఖాళీ సైటు, అన్ని దీని ఈసిమెంట్ హక్కులతోసహా.

ప్రదేశం: విజయవాడ
తేది: 19.01.2023
సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

డిమాండ్ నోటీసు

ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
సిఐఎన్: యు67100ఎంహెచ్2007పిఎల్‌సి174759
రిటైల్ సెంట్రల్ & రిజిష్టర్డు ఆఫీసు: ఇడెల్‌వీస్ హౌస్, ఆఫ్ సిఎస్‌టి రోడ్, కాలిన, ముంబయి-400098.

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3(1)తో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 ("ది యాక్ట్") యొక్క సెక్షన్ 13(2) క్రింద.

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద, **ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ ("ఇఎఆర్‌సి")** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు, ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, అధీకృత అధికారి చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు జారీచేసి, వారికి జారీచేసిన మరియు దిగువ ఇచ్చిన సదరు డిమాండ్ నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా, దిగువ రుణగ్రహీతలను కోరుతూ డిమాండ్ నోటీసు జారీచేశారు. పైవాటితో సంబంధించి, ఇందుమూలంగా మరోసారి ప్రకటన ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురణ నుండి 60 రోజుల్లోగా, ఇఎఆర్‌సి కి ఇందు సదరు రుణగ్రహీతలచే నిర్వహించబడినట్టైతే ఏవేని, ఇతర పత్రాలు/వ్రాతలతో చదువబడే రుణ ఒప్పందాల క్రింద దిగువ పేర్కొనబడిన తేదీల నుండి చెల్లించు వాస్తవ తేది/చెల్లించు తేది వరకు రుణగ్రహీతలను సదరు డిమాండ్ నోటీసులో వివరించినట్లుగా తదుపరి వడ్డీతో పాటు, దిగువ సూచించిన మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడినది. రుణాల బాకీని తిరిగి చెల్లించుట కొరకు హామీగా, సదరు రుణగ్రహీతచేత దిగువ అసెట్‌ను ఇఎఆర్‌సికి తాకట్టుపెట్టబడినవి.

క్ర. సం.	రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు పేరు/రుణ ఖాతా నంబరు	డిమాండ్ నోటీసు తేది& మొత్తాలు	ట్రస్ట్ & అసైనర్ వివరాలు
2	1. శ్రీ అట్లూరి శ్రీనివాస్ ("రుణగ్రహీత"), 2. శ్రీమతి అట్లూరి శివ శకుంతల ("సహ-రుణగ్రహీత") ఎల్‌విజెఎస్‌టిహెచ్0000062326.	21.12.2022 and Rs. 39,29,613.50	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి-418 మరియు ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.
ఆస్తి వివరణ: కృష్ణా జిల్లా, విజయవాడ (ఈస్ట్) జిల్లా, నిడమనూరు గ్రామం& గ్రామపంచాయతి వద్ద ఆర్.ఎస్.నం.156/1లో 705.14చ.గ.లు లేదా 589.89చ.మీ.ల విస్తీర్ణంతో డోర్ నం.6-137 దగ్గరలో ఆస్తి సరిహద్దులు: ఉత్తరం: పంచాయత్ బజార్, దక్షిణం: ఆలపాటి సుబ్రమణ్యం ఆస్తి, తూర్పు: ఆలపాటి రామ మోహన రావు& ఇతరుల ఆస్తి, పరిమి రవి యొక్క కొంత విస్తీర్ణం, పడమర: శ్రీ రాజరాజేశ్వర స్వామి టెంపుల్ యొక్క కొంత విస్తీర్ణం మరియు ఇతరు కొంత విస్తీర్ణం. పై పేర్కొన్న ఆస్తిలో అన్ని ఈసిమెంట్ హక్కులతో అసంపూర్తి స్థితిలో 100చ.అ.ల పార్కింగ్ ఏరియాతోసహా, 818చ.అ.లు ప్లింత్ ఏరియా, 100చ.అ.ల ఉమ్మడి ఏరియాతో 27.14చ.గ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థలభాగం, విజయవాడ (ఈస్ట్) జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో, నిడమనూరు గ్రామ& గ్రామపంచాయతి, "శ్రీ రాజేశ్వరి రెసిడెన్సీ"లో మూడవ అంతస్తు, ఫ్లాట్ నం.టిఎఫ్6గల ఆస్తి. ఆస్తికి సరిహద్దులు: ఉత్తరం: ఓపెను టు స్కై, దక్షిణం: ఓపెను టు స్కై, తూర్పు: ఉమ్మడి కారిడారు, పడమర: ఓపెను టు స్కై.			
3	1. శ్రీమతి పి. సాయి లీల కుమారి ("రుణగ్రహీత") 2. శ్రీ పుడియకొండ మోహన రావు ("సహ-రుణగ్రహీత") ఎల్‌విఐజెఎసుటిహెచు0000048572.	26.12.2022 and Rs. 36,57,978.65	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి 418 మరియు ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆస్తి వివరణ: క్రిష్ణా జిల్లా, పటమట సబు-రిజిస్ట్రారు, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు, విజయవాడ, వినాయకనగరు, యెనమలకుదూరు, విజయవాడ-520007 వద్ద ఆరు.ఎసు.నం.36/1, డోరు నం.29-67లో గల అన్ని ఈజిమెంటు& ఫిక్చర్సు అనుబంధంతో దానిపై ఆరుసిసి రూఫ్డు గ్రౌండు& మొదటి అంతస్తు నివాసిత భవనముతోపాటు 75.55చ.గ.లు లేదా 63.16చ.మీ.ల విస్తీర్ణం. ఆస్తికి సరిహద్దులు: తూర్పు: అనంతనేని శివరామ కృష్ణ ఆస్తి, దక్షిణం: కొక్కిలిగడ్డ ప్రసాద్ ఆస్తి, పడమర: రోడ్డు, ఉత్తరం: ఆరెపల్లి ఈశ్వర రావు ఆస్తి.			
6	1. శ్రీ బొడ్డు రాజు ("రుణగ్రహీత"), 2. శ్రీమతి బొడ్డు జయలక్ష్మి ("సహ-రుణగ్రహీత") ఎల్‌విఐజెఓహెచ్ఎల్000003615	20.12.2022 and Rs. 31,69,764.95	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి 418 మరియు ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆస్తి వివరణ: కృష్ణా జిల్లా, పడమట సబ్-రిజిస్ట్రార్, విజయవాడ రిజిస్ట్రార్, కృష్ణా జిల్లా, పెనుమలూరు మండలం, కానూరు గ్రామం& గ్రామపంచాయతి వద్దగల కానూరు గ్రామం యొక్క ఆర్.ఎస్.నం.137/1లోగల అన్ని ఈసిమెంట్ హక్కులతో 610చ.గ.లు లేదా 510.021చ.మీ.ల పూర్తి విస్తీర్ణంలో 30.0చ.గ.లు లేదా 25.083చ.మీ.ల విస్తీర్ణపు నివాసిత సైటు యొక్క విడదీయలేని మరియు సూచించని భాగం. సరిహద్దులు: తూర్పు: గుత్త ఉమామహేశ్వర రావు ఆస్తి, దక్షిణం: ఇతరుల ఆస్తి, పడమర: పంచాయత్ రోడ్డు, ఉత్తరం: పాండురంగా రావు మొ॥వారి ఆస్తి, 'ఎ' షెడ్యూలు ఆస్తిలో నిర్మించిన 25.0చ.అ.ల టూవీలర్ పార్కింగ్ ఏరియా మరియు ఉమ్మడి ఏరియాతో 950.0 చ.అ.ల ప్లింత్ ఏరియాతో "శ్రీ శివసాయి రెసిడెన్సీ"లో 1వ అంతస్తులోని ఫ్లాట్ ఎఫ్ఎఫ్‌బి. సరిహద్దులు: తూర్పు: ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-ఎ, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఫ్లాట్ నం. ఎఫ్ఎఫ్-సి ఆస్తి, ఉత్తరం: కారిడార్ & ఓపెన్ టు స్కై.			
10	1. శ్రీ నార భాస్కర రావు ("రుణగ్రహీత"), 2. శ్రీమతి రాధా నర్ర ("సహ-రుణగ్రహీత") ఎల్‌విఐజెఎస్‌టిటి0000015742 మరియు ఎల్‌విఐజెఎస్‌టిహెచ్0000015072.	20.12.2022 and Rs. 21,26,732.71	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి 417 మరియు ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.
ఆస్తి వివరణ: కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్-రిజిస్ట్రీ, ఇబ్రహీంపట్నం గ్రామం& గ్రామపంచాయతి, రమ్య టవర్స్‌లోగల ఆర్.ఎస్.నం.91/2సి, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ నం.101, ఫ్లాట్ నం.4802 గల 123చ.అ. ఉమ్మడి ఏరియాతో 944చ.అ.ల ప్లింత్ ఏరియాలో గ్రౌండ్ ఫ్లోర్‌లో దానిపై ఫ్లాట్‌తోపాటు 816చ.గ.లు లేదా 632.28చ.మీ.ల పూర్తి విస్తీర్ణంనకుగాను 40చ.గ.లు లేదా 33.44చ.మీ.ల విస్తీర్ణపు ఉమ్మడి హక్కులతో విడదీయలేని మరియు సూచించని ఆస్తి, సరిహద్దులు: సైటు కొరకు: తూర్పు: నిమ్మగడ్డ రాజేశ్వరి ఆస్తి, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెను టు స్కై, ఉత్తరం: ఓపెను టు స్కై& లిఫ్టు.			
17	1. శ్రీ వెంకట రవేషు దూబ ("రుణగ్రహీత"), 2. శ్రీమతి దూబ వెంకట బేబి సరోజిని ("సహ-రుణగ్రహీత") పిఆరు00401680.	05.01.2023 and Rs. 24,11,515.21	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి 424 మరియు కార్వి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్., ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (గతంలో స్మాల్ బిజినెస్ ఫిన్‌క్రెడిట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) చే సేకరించబడినది
ఆస్తి వివరణ: గుంటూరు జిల్లా, మంగలగిరి సబు-రిజిస్ట్రీ, డి.నం.232/2లో డోరు నం.1-365బి, అసెస్మెంటు నం.1023016917 గల గ్రౌండు & మొదటి అంతస్తుతోపాటు 80చ.గ.లు (67.2చ.మీ.లు) విస్తీర్ణపు సైటు. సరిహద్దులు: తూర్పు: బజారు, దక్షిణం: పి. రత్నకుమారి ఆస్తి, పడమర: షేక్ హైదర్ సాహెబ్‌చేత విక్రయించబడిన ఆస్తి, ఉత్తరం: బజార్.			
20	1. శ్రీ శివ నాగ మల్లేశ్వర రావు ఉంగుటూరి ("రుణగ్రహీత"), 2. శ్రీ యు. నాగరాజు ("సహ-రుణగ్రహీత"), 3. శ్రీ ఉంగుటూరి పెద్దసుబ్బారావు ("సహ-రుణగ్రహీత"), 4. వుంగుటూరి వెంకట సుబ్బమ్మ ("సహ-రుణగ్రహీత") పిఆర్00417076	05.01.2023 and Rs. 12,17,540.92	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి 424 మరియు కార్వి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్., ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (గతంలో స్మాల్ బిజినెస్ ఫిన్‌క్రెడిట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) చే సేకరించబడినది
ఆస్తి వివరణ: పత్తిపాడు సబ్-డిస్ట్రిక్ట్ పరిధిలో పత్తిపాడు కొత్త మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో గ్రామం, డి.నం.627, గుంటూరు జిల్లా, వింగనంపాడు గ్రామం, కోమెపాడు శివారు, డోర్ నం.10-1లోగల దానిపై నిర్మించిన పాత టైల్డ్ ఇంటితోపాటు 315చ.గ.ల విస్తీర్ణపు ఆస్తి మొత్తం, సరిహద్దులు: తూర్పు: పంచాయత్ బజార్, దక్షిణం: చిరుమామిల్ల సాంబశివ రావు సైటు, తూర్పు: సర్కారు రోడ్డు, ఉత్తరం: ఉంగుటూరి నాగేశ్వర రావు సైటు.			

ఒకవేళ పై చెప్పినట్లుగా ఇఎఆర్‌సికు సదరు రుణగ్రహీతలు చెల్లించుటలో విఫలం చెందిన, అన్ని ఖర్చులుగా, సదరు రుణగ్రహీతల పూర్తి బాధ్యత పైననే, వర్తించు రూల్స్ మరియు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద పై సెక్యూర్డ్ అసెట్స్ పై ఇఎఆర్‌సి చర్యలు తీసుకొనేందుకు ముందుకు సాగుతుంది. రుణగ్రహీతలు ఇఎఆర్‌సి యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనులేనిదే, అమ్మకం, లీజు లేదా ఇతర విధానాలలో పై చెప్పిన ఆస్తులను బదిలీచేయుట నుండి చట్టం క్రింద నిషేదింపబడినారు. చట్టం లేదా రూల్స్ యొక్క నియమాలను ఉల్లంఘించిన మరియు వివాదాలు కలిగించిన ఎవరైనా వ్యక్తి, జైలు శిక్షకు మరియు/లేదా జరిమానాకు బాధులగుదురు.

తేది: 20.01.2023
ప్రదేశం: ఆం.ప్ర. & తెలంగాణ
సం/- అధీకృత అధికారి,
ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ తరపున

Edelweiss ASSET RECONSTRUCTION
Ideas create, values protect

సముద్రం ఒకడి కాళ్ల దగ్గర
కూర్చొని మొరగదు. తుపాను
ఒకడికి చిత్తం అనడం ఎరగదు.
పర్వతం ఎవడికీ వొంగి సలాం చేయదు.
- శేషేంద్ర

వేకువ వెలి

ఎక్కడో దూరం నుంచి సన్నగా అజాఉన్
లోపల్నుంచి జీవ గడియారం
అలారం మోగిస్తాయి
కలల్ని ముగించి కాలంలోకి రమ్మని.
తనువూ మనసూ యేళ్లుగా అలవాటైపోయాయి
తమవైన ఘడియల్ని ఎలా చేజార్చుకుంటాయి
గీ... మంటూ కీచురాళ్ల రొద
హృదయపు లోతుల్ని తాకే
ప్రకృతి నిశ్శబ్ద సంగీతం
వెళ్లొస్తామంటూ పిట్టలు పాడే
సామూహిక వీడ్కోలు గీతాలు
దేహంలోనూ... మెదడులోనూ...
ప్రేమ తరంగాలో... ప్రేరక కంపనాలో...
నింపి తేజవంతం చేస్తాయి.
ఒకటీ... రెండూ... మూడూ...
అడుగులు లెక్కెడ్తూనో
నడక పొడవును కొలుస్తూనో
వెలుతురుగా విచ్చుకుంటున్న చీకటి
తిరిగి చూడకుండా తరలిపోతుంది.
ఇది నిన్నటి ప్రభాత గీతం
ఇప్పుడంతా ఉనికి కోసం ఆరాటం
దేవుళ్ళూ అందుకు అతీతం కాదు
సుదూర అజాఉన్‌కు పోటీగానో కోరస్ గానో
సమీపంలో బహుళ ప్రతిధ్వనుల సల్లల్లాహులు
ఒక్కో దేవుడు ఒక్కో ఆవాసంలో
కొలువై కూర్చున్నాక
వీధి మొత్తం పుణ్యతీర్థమే
ప్రతి దేవుడూ దేవతా
తమ ఉనికిని చాటుకుంటూ
లౌడ్ స్పీకర్ల నుంచి స్తోత్ర తరంగాలను
దిక్కుల్లోకి విసిరేస్తుంటారు
ఇక కీచురాళ్ల రాగాలు
వేకువ పాడే మౌనగీతాలు
చీకట్లోనే కలిసిపోతాయి
రేయితో పాటే సెలవు తీసుకుంటాయి
వేలుపులంతా కట్టకట్టుకొని
వేకువనిలా వెలేస్తారు!

– ప్రగతి

కల - జీవితం

నిద్ర కనికరిస్తే
స్వప్నం సాక్షాత్కరిస్తుంది
ఇల కాదని తెలిసినా
అది కరిగేవరకూ
అదే నిక్కమనుకొని
అందులో జీవించాల్సిందే
నీ మాట నీకే వినిపించకున్నా
ఎవరికీ అర్థం కానట్టు
నీ కలలో నీకు తెలిసినా
అది నిజమన్న ఊహలో ఉంటావు
జీవితాన కూడా అదే భ్రమలో
నీ పలుకులు అందరూ
ఇష్టపడుతున్నారన్న ఊహతో
నీ ఆశల పల్లకిని నీతోపాటు
అందరూ మోస్తారనుకున్న
నీ అమాయకత్వానికీ
నీ భ్రమలే సాక్ష్యం
ఏమరుపాటున నమ్మిన
ఎందరి నైజాలో బయటపడి
నీ సూత్రాలు సూత్రీకరణలు
తప్పులుగా బయటపడ్డప్పుడు
కల ఊహ నిజం విడివిడిగా
అగుపడి అదేమిటని చూస్తే
అది నేనేనంటుంది జీవితం!

– జంధ్యాల రఘుబాబు
98497 53298

సమాజ మార్పే మార్క్సిస్టు సాహిత్య లక్ష్యం



సమాజంలో దేనికీ ఒక అర్థమే వుండదు. ప్రతి దానికీ అనేక అర్థాలూ, నిర్వచనాలూ, దృక్పథాలూ వుంటాయి. కళాసాహిత్యాలు కూడా దీనికి మినహాయింపు కాదు. మనిషి ఆలోచనలు, భావాలు, సంస్కారాల నుంచి కళాసాహిత్యాలు పుడతాయనే అభిప్రాయం ఒకటుంది. కళాసాహిత్యాలు ఒక మహాత్యం అనే భావన కూడా బలంగా చెలామణిలో వుంది. స్వయంగా దేవుడే తమ చేత రచనలు చేయించాడని చెప్పుకున్న మహాకవులున్నారు.

కళాసాహిత్యాల విషయంలో మార్క్సిస్టుల దృక్పథం వేరు. వాళ్ళు సమాజాన్ని కళసాహిత్యాలకు పుట్టినిల్లుగా చూస్తారు. కళాసాహిత్యాలకే కాక సమస్త రంగాల్లో మనుషుల ఆలోచనలకు సమాజమే మూలం అనేది మార్క్సిస్టుల అభిప్రాయం. మరో మాటలో చెప్పాలంటే, మార్క్సిస్టుల సమాజ విమర్శ నుంచే మార్క్సిస్టుల కళాసాహిత్య పరామర్శ పుడుతుంది. సమాజ విమర్శలో రాజకీయ విమర్శ కూడా వుంటుంది గనుక మార్క్సిస్టు సాహిత్యంలోనూ రాజకీయ విమర్శ వుంటుంది. దైవాంశాన్నీ, మహాత్యాలను తొలగించి కళసాహిత్యాలను శుష్కంగా మారుస్తున్నారనే నింద ఎలాగూ మార్క్సిస్టు సాహిత్యకారుల మీద వుంది. మార్క్సిస్టు సాహిత్యకారులకు సౌందర్యశాస్త్రం (aesthetics) తెలీదుబీ సాహిత్యాన్ని రాజకీయాలతో కలుషితం చేస్తారు అనే విమర్శ కూడా వుంది. సౌందర్యశాస్త్రంలో కూడా వర్గ దృక్పథం వుంటుంది. శ్రమే జీవన సౌందర్యం అనేది మార్క్సిస్టు సాహిత్యకారుల ప్రమాణం. కష్టాలు,. సవాళ్ళు, అణిచివేతల నుంచి బయటపడడానికి జీవులు చేసే కృషి కన్నా సౌందర్యం ప్రకృతిలోగానీ, సమాజంలోగానీ ఏముంటుందీ?

మార్క్సిస్టు సాహిత్యంలో మాత్రమే రాజకీయాలుంటాయా? ఇతర సాహిత్యాల్లో రాజకీయాలు వుండవా? అనేది తప్పనిసరిగా పరిశీలించాల్సిన అంశం. 'కళ కళ కోసమే' అనేది చాలా కాలం ఒక విలువగా కొనసాగింది. 'రాజ్యం రాజ్యం కోసమే' అనే రాచరిక నియంతృత్వం నుంచి పుట్టిన సిద్ధాంతం ఇది. ఆధునిక యుగంలో దీని మీద అనేక విమర్శలు వెల్లువెత్తాయి. 'ప్రభుత్వాలు ప్రజల కోసం' అనే కొత్త విలువలు వచ్చాయి. 'కళ కళ కోసమే' (లాటిన్‌లో Ars Gratia Artis) అనే విలువతో హాలీవుడ్‌లో మెట్రో గోల్డ్విన్ మేయర్ (ఎంజియం) అనే భారీ చలనచిత్ర నిర్మాణ సంస్థ 1924లో ఏర్పడింది. కళా విలువల గురించి అంత గొప్పగా మాట్లాడిన ఆ సంస్థే 'జేమ్స్ బాండ్' ఫ్రాంచైజీను నిర్మించింది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత బ్రిటీష్ నవలాకారుడు ఇయాన్ లాంచెస్టర్ ఫ్లెమింగ్ 'జేమ్స్ బాండ్' పాత్రను సృష్టించాడు. బాండ్‌బీ బ్రిటీష్ సీక్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (M16) ఏజెంటు. ప్రపంచ మార్కెట్లో అప్పట్లో బ్రిటన్, అమెరికాలతో పోటీపడుతున్న రష్యా, చైనా తదితర సోషలిస్టు దేశాల్ని అవహేళన చేయడం ఈ పాత్ర లక్ష్యం. 1991లో రష్యా పతనం తరువాత జేమ్స్ బాండ్ పాత్ర ముస్లిం–చమురు దేశాల్ని అవహేళన చేయడం మొదలెట్టింది. కళకళ కోసం నినాదంతో మొదలైన సంస్థ ఇంత పచ్చిగా అంతర్జాతీయ రాజకీయాల్ని చిత్రిస్తూ సినిమాలను తీసింది. ఎంజియం సంస్థ ప్రస్తుతం ఇ–కామర్స్ జెయింట్ అమెజాన్ ఆధీనంలో వుంది. కళకళ కోసం అనే నినాదం వెనుక కూడా రాజకీయార్థిక ప్రయోజనాలుంటాయని చెప్పడానికి ఈ ఉదాహరణ చాలు.

మార్క్సిస్టు సాహిత్యకారులు తమకు రాజకీయాలున్నాయని బాహాటంగా ప్రకటించడమేగాక కళాసాహిత్యాలకు రాజకీయాలు వుండాలని కూడా వాదిస్తారు. మరోమాటలో చెప్పాలంటే ... ఇతరులు చాటుగా చేసే పనిని మార్క్సిస్టులు బాహాటంగా చేస్తారు. చెప్పాల్సిందీ, చెయ్యాల్సిందీ చాటుగానా? బాహాటంగానా అనేది ఒక్కటే తేడా. మనుషుల సామాజిక, రాజకీయ, మేధో జీవిత ప్రక్రియలన్నింటినీ భౌతిక ఉత్పత్తి జీవన విధానం నిర్ణయిస్తుందననేది మార్క్సిస్టుల స్థూల అవగాహన. 'మనుషుల సామాజిక అస్తిత్వాన్ని వాళ్ళ చైతన్యం నిర్ణయించదు. అందుకు విరుద్ధంగా మనుషుల సామాజిక అస్తిత్వం వాళ్ళ చైతన్యాన్ని నిర్ణయిస్తుందని' ఒక సందర్భంలో కార్ల్ మార్క్స్ చాలా స్పష్టంగా ప్రకటించాడు. It is not the consciousness of men that determines their being, but on the contrary their social being, that determines their consciousness.

సామాజిక అస్తిత్వం (social being) అనే మాట చాలా విస్తృతమైనది. ఇందులో ఆర్థికం, సాంస్కృతికం, కులం, మతం, లింగం, వర్ణం, భాషా, ప్రాంతం వగైరాలు ఎన్నో వుంటాయి. కొందరు సామాజిక అస్తిత్వాన్ని కేవలం ఆర్థిక పునాదికే పరిమితం చేయడంవల్ల దాని విస్తృతికి గండిపడుతోంది. ఆర్థికేతర అణచివేతకు గురయ్యే సమూహాలు మార్క్సిస్టు సంస్థలకు దూరం కావడానికి ఇలాంటి సంకుచిత వాదాలు దోహదం చేస్తాయి. అన్ని రకాల దోపిడీ అణిచివేతల లక్ష్యం సారాంశంలో ఆర్థికమే కావొచ్చుగానీ దోపిడీ అణిచివేతలన్నీ ఆర్థిక రూపంలో మాత్రమే వుంటాయనడం సరి కాదు.

మార్క్సిస్టు కళాసాహిత్యాలు 19వ శతాబ్దం మధ్యలోనో, రష్యాలో సోషలిస్టు విప్లవం విజయవంతం అయిన తరువాతో మొదలయ్యాయనే అభిప్రాయం కూడా సరైనది కాదు. అణగారిన సమూహాలను విముక్తి చేసే ప్రణాళికను మార్క్స్ 1848లో ప్రచురించిన మాట నిజమేగానీ, సమాజంలో అనాదిగా రకరకాల రూపాల్లో అణిచివేత పీడనలు కొనసాగుతూ వున్నాయి. వాటిని ప్రతిఫలించే సాహిత్యం కూడా అనాదిగా వుంది. ఇప్పుడూ వుంది. కార్మికవర్గ సాహిత్యం తప్ప మరేదీ మార్క్సిస్టు సాహిత్యం కాదని ఎవరైనా అంటే వాళ్ళు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని మూర్ఖంగా బలహీనపరుస్తున్నారని అర్థం. దళిత, బహుజన, మైనారిటీ, ఆదివాసీ, స్త్రీవాద వగైరా అణగారిన సమూహాలు సాగించే ఉద్యమాలన్నీ విముక్తి పోరాటాలే! అవి సృష్టించే కళాసాహిత్యాలన్నీ విముక్తి సాహిత్యమే. టెక్నికల్‌గా మార్క్సిస్టు సాహిత్యమే.

మార్క్సిస్టు సాహిత్య సంఘాలు ఒక్కో చారిత్రక దశలో తమ నిర్ణీత కార్యక్రమాన్ని బట్టి ఒక్కో రకం సాహిత్య ప్రక్రియకో, ఒక్కో రకం సామాజిక అంశానికో అధిక ప్రాధాన్యం ఇస్తుంటాయి. అంత మాత్రాన ఇతర సాహిత్య ప్రక్రియలో, ఇతర సామాజిక అంశాలో అప్రధానమైనవి అయిపోవు. మార్క్సిస్టు దృక్పథం నుంచి సౌందర్యశాస్త్రాన్ని అభివృద్ధి చేసినవారి జాబితా చాలా పెద్దది. అనటోలి లూనచరస్కీ, జియోర్జీ ప్లెఖనొవ్, బెర్తొల్ట్ బ్రెక్ట్, ఆంటోనియో గ్రాంస్కీ, జియోర్జ్ లుకాక్స్ మొదలైనవారు వారిలో ప్రముఖులు. తెలుగులో రాచమల్లు రామచంద్రారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు మార్క్సిస్టు సాహిత్య విమర్శను సాహిత్యరంగంలో వర్గపోరాటం స్థాయికి తీసుకుని వెళ్ళారు. ఆసక్తి వున్నవాళ్ళు వారి పుస్తకాలను విస్తారంగా అధ్యయనం చేయాలి. ఔత్సాహికులు మాత్రం ముందుగా కొన్ని మూల సూత్రాలను అయినా తెలుకోవడం ముఖ్యం.

మార్క్సిస్టు సమాజ విమర్శ, సాహిత్య పరామర్శ ఎలాంటి మార్మికతకు తావియ్యకుండా సూటిగా సరళంగా వుంటుంది. ఇందులో మూడే మూడు మెట్లున్నాయి.

మొదటి మెట్టు : సమాజాన్ని వున్నది వున్నట్టు నిజాయితీగా చూపెట్టాలి. సమాజంలో ఏ విభాగాన్ని ఏ అంశాన్ని తీసుకున్నా దాని యథాస్థితి కొందరికి ఆహ్లాదకరంగానూ మరికొందరికి భరించశక్యంగానూ వుంటుంది. వివాహ వ్యవస్థనే తీసుకోండి. ప్రపంచ దేశాల్లోని దాంపత్య వ్యవస్థల్లో భారత దాంపత్య వ్యవస్థ మహా గొప్పది అనంటే మన దేశంలో పురుషులకు ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. కానీ, స్త్రీలకు దానికి విరుద్ధమైన అనుభవాలు వుండొచ్చు. వాళ్ళు పై అభిప్రాయాన్ని తప్పక ఖండిస్తారు. సమాజంలో సమతుల్యత కోసమే కులవ్యవస్థ వుందని అంటే యజమాని కులాలకు ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. కానీ శ్రామిక కులాల అనుభవాలు అందుకు విరుద్ధంగా వుండొచ్చు. వాళ్ళు పై అభిప్రాయాన్ని ఖండిస్తారు. మరే దేశంలోకన్నా భారతదేశంలో మత సహనం పరిఢవిల్లుతోంది అనంటే మెజారిటీ మత సమూహాలకు ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. కానీ, మైనారిటీ మత సమూహాల అనుభవాలు అందుకు విరుద్ధంగా వుండొచ్చు. వాళ్ళు పై అభిప్రాయాన్ని తప్పక ఖండిస్తారు. ప్రతి అంశంలోని రెండు విరుద్ధ వాస్తవాలను సాహిత్యం నిజాయితీగా ప్రతిఫలించాలి.

రెండో మెట్టు : సమాజం ఇప్పుడు అలా ఎందుకు వున్నదో వివరించాలి. కళాసాహిత్యాలు కేవలం కొందరి ఆహ్లాదాన్నీ, మరికొందరికి ఆవేదనను చిత్రిస్తే సరిపోదు. కొందరికి సౌకర్యం ఎలా దక్కిందో ఇతరులకు ఆ దుస్థితి ఎందుకు దాపురించిందో వివరించాలి.

మూడో మెట్టు : సమాజంలోని అణగారిన సమూహాల జీవితాల్లో మార్పును ఎలా తేవచ్చో సూచించాలి. సమాజంలో వైవిధ్యాలు వుండొచ్చు. వైరుధ్యాలు వుండొచ్చు. శత్రు వైరుధ్యాలు వుండకూడదు. వాటిని తొలగిస్తే అణగారిన సమూహాల జీవితాల్లో మార్పు వచ్చి కొత్త సమాజం వారికి కూడా ఆహ్లాదకరంగా వుంటుంది.

కళాసాహిత్యాలు కాల్పానికంగా మాత్రమే వుండాలిగానీ వాస్తవికతతో వాటికేం పని? అనే వాళ్ళని అలా వుండనివ్వండి! సమాజాన్ని వున్నదున్నట్టు చిత్రించాలి అనే మార్క్సిస్టు సాహిత్య ఆదేశంతో మార్క్సేతరులకు కూడా పెద్దగా అభ్యంతరం వుండకపోవచ్చు. అయితే, సమాజం అలా ఎందుకు వున్నదో వివరించాలనే విషయంలో తగవు వుంటుంది. కవులు, రచయితలు భావుకులుగా వుండాలే తప్ప శాస్త్రపరిశోధకుల్లా వుండరాదనే గడుసరి వాదంతో వాళ్ళు సామాజిక వాస్తవిక వాదాన్ని ఎదుర్కొంటారు. ఇక సమాజాన్ని మార్చాలనే విషయంలో మాత్రం రెండు రకాల సాహిత్యాల మధ్య తగువు తీవ్రంగా వుంటుంది. సమాజాన్ని మార్చడానికీ, మార్చమని ఆదేశించడానికి కవులు, రచయితలు ఉపదేశకులా? నియంతలా? అని వాళ్లు విరుచుకుపడతారు. సమాజంలో మార్పును అడ్డుకోవడానికి వాళ్ళు కొంచెం గట్టిగానే నడుం బిగిస్తారు. ఇలాంటి సందర్భాల్లోనే సాహిత్యరంగంలో వర్గపోరాటం అవసరం అవుతుంది.

ఇతరుల వాదాలు ఎన్నివున్నా ఎలా వున్నా సమాజంలో అణగారిన సమూహాల జీవితాలను మెరుగ్గా మార్చడమే మార్క్సిస్టు కళా సాహిత్యాల లక్ష్యం. కార్ల్ మార్క్స్ చనిపోయినపుడు ఆయన సమాధి వద్ద ఒక కొటేషన్ రాయాల్సి వచ్చింది. మార్క్స్ జీవిత కాలంలో అనేక గ్రంథాలు ప్రచురించాడు. కొన్ని లక్షల వాక్యాలు రాశాడు. వాటన్నింటి నుంచి ఆయన భావాల్ని ప్రతిఫలించే ఒక వాక్యాన్ని ఏంగిల్స్ ఎంపిక చేశాడు. ఆ వాక్యం ఏమంటే ... : "తత్త్వవేత్తలు ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించడంతో సరిపెట్టారు. నిజానికి చెయ్యాల్సిందేమంటే ప్రపంచాన్ని మార్చడం.' (The philosophers have only interpreted the world, in various ways. The point, however, is to change it). సమాజాన్ని మార్చడమే మార్క్సిస్టు సాహిత్య లక్ష్యం.

(2022 నవంబరు 25, 26 తేదీల్లో జరిగిన రైటర్స్ మీట్‌లో చేసిన ప్రసంగం ఆధారంగా)

– ఉషా యస్ డానీ

పరిశోధకుల దృష్టిలో మన వేమన

'అంధకారమైన క్షీణయుగంలో జన్మించి, ఆ కాలపు దుర్నీతిని ఏకాకిగా ఎదిరించాడు వేమన. వేమన స్వరం కఠినంగా, వాక్కు పరుషంగా, విమర్శ కర్కశంగా ఉన్నందున అతడు కఠిన స్వభావుడని అర్థం చేసుకోకూడదు. వేమన సాధు స్వభావుడు. అనురాగ పూరితుడు, సహనశీలి' అంటారు ఆయన పద్యాల ఆధారంగా నార్ల వెంకటేశ్వరరావు. విగ్రహారాధనను వ్యతిరేకించిన సాంఘిన విప్లవకారునిగా కూడా చూసారాయన. 'వేమన' ఆకర్షించని స్వదేశి, విదేశీ సాహితీ విమర్శకులు లేరనే చెప్పాలి. తెలుగులో వేమన జీవితం గురించి పరిశోధనలు చేసిన వారిలో వంగూరి సుబ్బారావు, వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రి, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, బండారు తమ్మయ్య, ఆరుద్ర, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, వేమూరి విశ్వనాథశర్మ, కట్టమంచి రామలింగా రెడ్డి, త్రిపురనేని వెంకటేశ్వరరావు, ఎన్.గోపి తదితరులు ఉన్నారు. వారు ప్రసిద్ధమైన విశ్లేషణా రచనలను వెలువరించారు. బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు 1839లో పుస్తక రూపంలో ప్రథమంగా వెలుగులోకి వచ్చాయి.

వేమన ప్రజాకవి. 1652 – 1730 మధ్యకాలంలో జీవించాడని, కొండవీటి రెడ్డి రాజవంశానికి చెందిన వాడని చెప్పే కథనాలున్నాయి. సి.పి.బ్రౌన్ ప్రకారం ... ఇతను జంగమ కులానికి చెందిన శివకవి. కడప మండలంలో చిన్న పల్లెలో మధ్య తరగతిలో జన్మించాడనే పరిశోధక కథనాలున్నాయి. అతని జీవితానికి చెందిన అంశాలున్న పద్యాలను ప్రముఖంగా ప్రస్తావించిన పరిశోధకులున్నారు. 'నందన సంవత్సరమున / పొందుగ కార్తీకమందు బున్నమి నాడీ/' 'ఊరు కొండవీడు వునికి పశ్చిమం వీధి/ మూక చింతపల్లె మొదటి వీధి' అనే పద్యం వల్ల ఆయన జన్మ వృత్తాంతం గురించి కొందరు వివరించారు. బండారు తమ్మయ్య విశ్లేషణలకు హేతుబద్ధమని అంగీకరించారు ఆచార్య ఎన్.గోపి. వేమన కులం విషయంలో వివిధ కథనాలున్నాయి.

గ్రియర్సన్ అనే సాహిత్య పరిశోధకుడు వేమన 16వ శతాబ్దానికి చెందినవాడని నిర్ణయించాడు. భారతీయ భాషా సాహిత్యాల అధ్యయనానికి తన జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ విదేశీ విద్వాంసుడు జి.వి.గ్రియర్సన్ 'నేటి కవులందరిలో అత్యంత ప్రసిద్ధిని పొందిన కవి వేమన. వేమనకు ఆపాదించబడని సామెత కాని, సూక్తిగాని ఉండటం చాలా అరుదని అభిప్రాయపడ్డారు. సి.పి.బ్రౌన్ సహితం తను రచించిన పుస్తకం పీఠికలో 'నాకు లభించిన పద్యాలు మొత్తం 2,500. వీటిని పోల్చినప్పుడు సమానమైన పద్యాలు మొత్తం రెండు వేలకు కొంచెం మించి ఉన్నట్లు తేలింది' అని రాసుకున్నారు. బ్రౌన్ తరువాత డా॥జి.యు. పోప్, మేజర్ ఆర్.ఎం. మెక్ డోనాల్డ్ గ్రంథానికి వేమనపైన ప్రత్యేకమైన పరిశోధనలు చేశారు. అబేదుబాయ్ రచించిన గ్రంథానికి సంపాదకీయ వ్యాసం రాసిన పోప్ 'వేమన పద్యాల మాధుర్యాన్ని మించిన మరో కవిత లేదని' పేర్కొన్నారు. విదేశీయుల్ని వేమన ఆకర్షించినంత గొప్పగా తెలుగు సాహిత్యమంతటిలో మరొక కవి రచనలు ఆకర్షించ లేదనిమ్యాక్ డోనాల్డ్ అభిప్రాయం.

వేమన తన రచనలను పండితుల కోసం రాయలేదు. తాను నిరంతరం సంచరిస్తున్న సమాజం, తనకు జరిగిన అవమానాలు, ఆస్వాదించిన ఆనందాలు, ఆర్థిక పరమైన కష్టాలు, నష్టాలు, ఆనాటి సమాజంలో ఆచారాలు, సంప్రదాయాల వెనుక ఒక వర్గపు స్వార్థం, మరో వర్గపు మౌఢ్యం, ప్రజల్లోని నిరక్షరాస్యత, అమాయకత్వం, అంటరానితం, మతాల పేరిట, విగ్రహారాధన పేరిట జరుగుతున్న దోపిడీ ... వంటివి ఆయనలో సమాజం పట్ల ఒక విధమైన జాలిని పెంచాయి. అతనిలో నిజాయితీని ప్రశ్నించాయి. నిలదీయమనే కోరిక పెంచాయి. ఈ కారణాల చేతనే ఆయన రచనలను పెక్కుమంది తిరస్కరించారని, ఆదరించలేదని, ఆయనను వెలివేసారని అంటారు నార్ల. 1829లో కావలి వేంకటరామస్వామి గారు నూట ఎనిమిది మంది కవుల చరిత్రతో ఒక పుస్తకాన్ని రచించారు. వీరంతా దక్షిణ భారతదేశంలో ప్రాచీనార్వాచీన ప్రసిద్ధులు. వీరిలో నలభై ఏడుగురు తెలుగు కవులు. వీరిలో వేమనకు చోటివ్వలేదు. 'తెలుగు ప్రజలు వేమన కవిత్వాన్ని అధికంగా అభిమానిస్తారని పాశ్చాత్యుడైన పోప్ పేర్కొన్నారు. వేమనలోని హేతువాదం, ఏకేశ్వరోపాసన, మొరటు పద ప్రయోగాలు ఛార్లెస్– ఇ–గోవర్‌ను ఆకట్టుకొని వేమనపై పద్య రచన చేశారు. ఇందుకు బ్రౌన్ రచనలే ఆధారమని చెప్పారు. సి.పి.బ్రౌన్ తనకు లభించిన పద్యాలను మతం, నీతి, వ్యంగ్యం, తాత్వికం, ప్రకీర్ణం అనే పద్ధతిలో వర్గీకరించారు.

వేమనను తనువంతా విస్తరింపచేసుకొన్న పాశ్చాత్యుడు క్యాంబెల్. ఆయన మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ పత్రికలో 'నిశ్చయంగా వేమన ప్రజాకవి. ఆయన రాసింది పండితులకు కాదు. నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రజలకు. వేమన ప్రసిద్ధికి కారణం ఆయన ప్రబోధాలు మాత్రమే కాదు; సరళము, శక్తిమంతమూ అయిన కవితా శైలి కూడా కారణమే' అని రాశారు. ఇది శతశాతం సత్యం. క్యాంబెల్ 'మేము వేమనను తప్ప వేరే దైవాన్ని పూజింపమని ఆయన మా ఇలవేల్పుగా పేర్కొన్న వ్యక్తిని సహితం కలుసుకున్నారట!

వేమనను గురించి పరిశోధన చేసిన ప్రథమాంధ్రుడు కె.వి.లక్ష్మణరావు. ఆంధ్రదేశంలో చారిత్రక, సాహిత్య పరిశోధనలకు కూడా ఆయనే మార్గదర్శి. ఆ తరువాత ఎందరో వేమనపైన శ్రద్ధ చూపారు. బ్రౌన్, క్యాంబెల్ తదితరుల బాటలో మరికొందరు పరిశోధించి, విశేష కోణాలను ఆవిష్కరించారు. వేమన పద్యాల్లోని మానవతాధర్మం, సర్వమానవ సమానత్వం, కులవివక్షలోని 'శూన్యత', 'నైతికత', మూఢ నమ్మకాల ఖండన వంటి విషయాలను ప్రస్తావించారు. తెలుగు పరిశోధకులు సహితం వేమనలోని నిజమైన తత్వసారాన్ని వెలుగులోకి తెచ్చారు. వివక్ష సమాజంపై ఈటెల్లా విసిరిన వేమన ఆటవెలది పద్యాల అవసరం ఇప్పుడూ చాలా ఉంది.

– భమిడిపాటి భవానీ శంకర్
94928 58395

సాహిత్య సౌరభం .. రంగస్థల వైభవం ...

రంగస్థలం, సాహిత్యం ఈ రెంటి మేలు కలయికగా అజో విభో కందాళం ఫౌండేషన్ వారి వార్షిక ఉత్సవాలు ఈనెల 5 – 8 తేదీల మధ్య నంద్యాలలో జరిగాయి.. రంగస్థలం కథా నాటికల పోటీ ప్రదర్శనలు 5, 6, 7 తేదీల్లో సాయంత్రాల్లో; సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు 6, 7, 8 తేదీల్లో ఉదయం, సాయంత్ర వేళల్లో జరిగాయి. ఈ సంవత్సరం సరిలేరు నీకెవ్వరు జీవితకాల సాహితీ మూర్తి సాధనా పురస్కారం పల్లేటి లక్ష్మీ కులశేఖర్‌కు 5న, విశిష్ట బాల సాహిత్య రచనాపురస్కారం ఎం.హరి కిషన్‌కు 6న అందజేశారు. వారి కృషి, రచనలకు సంబంధించిన విశేష సంచికలను కూడా ఫౌండేషన్ వారు ప్రచురించారు. 8వ తేదీ ఉదయం డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డికి 2023 ప్రతిభ మూర్తి జీవితకాల సాధనా పురస్కారాన్ని అందించి, ప్రతిభా వైజయంతి సమ్మానోత్సవ విశేష సంచికని ప్రచురించారు, ఎప్పటిలాగే!

ఉభయ రాష్ట్రాల్లోని సమాజాల దరఖాస్తు చేసుకున్న 28 నుంచి 19 నాటికలను ప్రాథమిక పరిశీలన చేసిన అనంతరం ఏడు నాటికలను నంద్యాల టౌన్ హాల్లో ప్రదర్శించారు. మొదటి రోజు ఐదో తేదీ మినిస్టరొతాండు, తెల్ల కలువ – నల్ల కోయిల, స్వర్ణకమలాలు; 6న కొత్త పరిమళం, అగ్ని సంస్కారం; 7న థాంక్స్ ఫర్ ద పీఎం, ప్రేమతో నాన్న నాటికలను ప్రదర్శించారు. వీటిలో ఉత్తమ ప్రదర్శనలుగా కొత్త పరిమళం (శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కతిక సేవా సమాజం, బొరివంక); ప్రేమతో నాన్న (శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు) నిలిచాయి.

అజో విభో కందాళం –2023 సాహితీ, ప్రతిభా వైజయంతి పురస్కారాలు పొందిన ముగ్గురూ మూడు రంగాల్లో విశిష్ట సాహితీమూర్తులు. పౌరాణిక పద్య నాటకాలు, సాంఘిక నాటకాలు, నాటికలు, ఆకాశవాణి శ్రవ్య నాటికలు, నాటకాలు రాసిన పల్లేటి లక్ష్మీ కులశేఖర్ లబ్ద ప్రతిష్టుడైన తెలుగు నాటక రచయిత. వీరిపై సమ్మానోత్సవ విశేష సంచికకు డాక్టర్ మూల మల్లికార్జున రెడ్డి సంపాదకత్వం వహించారు. (37 మంది వ్యాస కర్తల రచనలతో). ఎం.హరికిషన్ సమ్మానోత్సవ విశేష సంచికకు కథా రచయిత జి.ఉమామహేశ్వర్ సంపాదకత్వం వహించారు (32 మంది వ్యాస కర్తలు). డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డి ప్రతిభా వైజయంతి సమ్మానోత్సవ విశేష సంచికకు కథా రచయిత వడలి రాధాకష్ణ సంపాదకత్వం వహించారు (22 మంది వ్యాస రచయితలు). ఇందులోని ప్రఖ్యాతులైన రచయితలు ఆ వ్యక్తుల గురించిన తమ అభిప్రాయాలను భిన్న కోణాల్లో రాసి దర్శింపచేశారు. పురస్కార గ్రహీతల జీవిత సంగ్రహాల్ని పరిశీలిస్తే అవి వ్యక్తిత్వ వికాస పాఠ్యాంశాల్లా మనల్ని ప్రేరేపిస్తాయి, ఉత్సాహపరిస్తాయి, గర్వపడేలా చేస్తాయి.

'ప్రేమతో నాన్న' నాటికలో ఓ సన్నివేశం

'కథానాటికలు 2023' పేరుతో ఈ సంవత్సరం కూడా తుది పోటీలకు ఎంపిక చేసిన ఏడు కథానాటికల్ని ఒక సంకలనంగా విడుదల చేశారు. ఈ సంచికలో మూల కథతో పాటు నాటకీకరణ లేదా నాటకానువాదం కలిపి ఉంటాయి. బహుమతి పొందిన రెండు నాటికల్లో 'కొత్త పరిమళం' ... మనుషుల మనసుల్లో, దేశాల మధ్య నిర్మించుకున్న సరిహద్దులు తొలగించి, మానవత్వం వర్ధిల్లాలి అన్న సందేశంతో సాగింది. మూల కథా రచయిత కాండ్రేగుల శ్రీనివాసరావు కాగా, నాటకీకరణ : కేకేఎల్ స్వామి దర్శకత్వం : బిఎంఎస్ పట్నాయక్. 'ప్రేమతో నాన్న' మూల కథ రచయిత విజయార్కె. నాటకీకరణ : రావి నాగేశ్వరరావు. దర్శకత్వం : గోపరాజు విజయ్. ప్రతి తండ్రికి కూతురు పట్ల ప్రేమ ఒక్కటే ఉంటే చాలదు, వాళ్లు కష్టాల్లో ఉంటే బాధపడడం కాకుండా వాటిని ఎదిరించే మనోధైర్యం వాళ్ళల్లో కలిగించడానికి, తగిన ఆత్మ ధైర్యం కలిగి ఉండాలని ఈ నాటిక చెబుతుంది. అమ్మాయిలూ, ధైర్యంగా నిలబడండి. అన్యాయానికి ఎదురు తిరగండి. మిమ్మల్ని మీరు నిరూపించుకుంటూ ముందుకు సాగండి.. అన్నదే ఈ నాటిక సందేశం. ఫౌండేషన్ నిర్వాహకులు, బుద్ధుని విధేయులు అప్పాజోశ్యుల సత్యనారాయణ, కందాళం రామానుజాచారి, నంద్యాల కళారాధన సంస్థ తరపున డాక్టర్ జి రవికృష్ణ, డాక్టర్ మధుసూదన్ రావు నిర్వహణ బాధ్యతలను క్రమశిక్షణతో సమయపాలనతో నిర్వహించడం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

పదండి ముందుకు.. పదండి తోసుకు..

- ప్రత్యామ్నాయ విధానాలే ధ్యేయంగా కార్మిక, కర్షక ఐక్యపోరాటాలు
- ఏప్రిల్ 5 మజ్దూర్‌కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయండి
- సిఐటియు అఖిల భారత 17వ మహాసభ పిలుపు
- పలు తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం

ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన ఆఫీస్ బేరర్లు, వర్కింగ్ కమిటీ, జాతీయ కౌన్సిల్ సభ్యులు

బెంగుళూరు నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

కార్మిక, కర్షక ఐక్య పోరాటాలే ధ్యేయంగా పదండి ముందుకు... పదండి తోసుకు... మతోన్మాద శక్తులను చీల్చి చెండాడుతూ... నయా ఉదారవాద విధానాలను తిప్పికొడుతూ మునుముందుకు సాగండి అంటూ సిఐటియు అఖిల భారత 17వ మహాసభ పిలుపునిచ్చింది. ఐక్యపోరాటాల ఆవశ్యకతను నొక్కి చెప్పింది. బెంగళూరులోని శ్యామల్ చక్రవర్తి నగర్ (ప్యాలెస్ గ్రౌండ్)లోని రంజనా నిరులా, రఘునాథ్ సింగ్ వేదిక సాక్షిగా ఐదురోజుల పాటు ఉత్తేజితపూరిత వాతావరణంలో సాగిన మహాసభ అదివారం ముగిసింది. ప్యాలెస్ గ్రౌండ్‌లో ఎర్ర జెండాలు, తోరణాలు, మహనీయుల సూక్తులతో ఏర్పాటు చేసిన ఫొటోలు ప్రతినిధుల్లో నూతన ఉత్తేజాన్ని నింపాయి. ఢిల్లీలో ఏప్రిల్ ఐదో తేదీన తలపెట్టిన మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీలో లక్షలాది మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగానూ, కర్ణాటకలోనూ కార్మికులు చేస్తోన్న పోరాటాలకు సంఘీభావం తెలుపుతూ సభలో తీర్మానాలు ప్రవేశపెట్టారు. వీటితోపాటు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ, మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తోన్న కుట్రలను ఖండిస్తూ తీర్మానాలను ప్రవేశపెట్టారు. విద్య, వైద్య రంగాల బలోపేతం, నిరుద్యోగ సమస్యపైనా తీర్మానాలు చేశారు. నాలుగో రోజు నాలుగు కమిషన్ల (ఆధునిక ఉత్పాదక రంగంలో కార్మికులను సంఘటితం చేయడం, ఎదురవుతున్న సవాళ్లు- మతతత్వానికి వ్యతిరేకంగా కార్మికవర్గ పోరాటం, ప్రతిఘటన-భారతదేశంలో నయా ఉదారవాదం, కోవిడ్ సంక్షోభ నేపథ్యంలో కార్మికుల అంతర్గత వలసలు - ఉపాధి సంబంధాల్లో మారుతున్న పరిస్థితులు)పై ప్రతినిధులు నాలుగు బృందాలుగా విడిపోయి సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్తులో చేయాల్సిన పోరాటాలపై కార్యాచరణ రూపొందించారు. మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో కార్మికుల మధ్య చీలిక తీసుకొచ్చి వారి హక్కులను హరిస్తోన్న బిజెపి విధానాలపై ఉద్యమించేందుకు ఐక్యపోరాటాలను నిర్మించాల్సిన ఆవశ్యకతను ఈ మహాసభ నొక్కి చెప్పింది.

మహాసభలో ఆలిండియా కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కేంద్ర కార్మిక సంఘాల నేతలు సౌహార్ద్ర సందేశాలిస్తూ సిఐటియు ఐక్యపోరాటాల్లో తాము కలిసి నడుస్తామని ప్రతినబూనారు. డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి ఐదురోజుల పాటు మహాసభ ప్రాంగణంలోనే ఉండి చర్చలను పరిశీలించారు. చేగువేరా కుమార్తె అలైదా గువేరా, మనువరాలు ప్రొఫెసర్ ఎస్తేఫానియా మహాసభ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే ప్రతినిధులు అందరూ నిలబడి పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఘన స్వాగతం పలికారు. 'వర్కింగ్ క్లాస్ యూనిటీ వర్ధిల్లాలి... అప్‌అప్ సోషలిజం... డౌన్‌డౌన్ క్యాప్టలిజం... సోషలిజం వర్ధిల్లాలి' అనే నినాదాలతో సభాప్రాంగణం మార్మోగిపోయింది. ఫాసిస్టు ఎజెండాతో ముందుకెళు_న్న మోడీ సర్కారు పాలన తీరును నిరసిస్తూ వాల్‌ను ఏర్పాటు చేసి దానిపై సంతకాల సేకరణ, అభిప్రాయాల సేకరణ చేపట్టారు. మహాసభ చివరిరోజు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బెంగళూరులోని నేషనల్ కాలేజీ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలొచ్చి జయప్రదం చేశారు.

అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.హేమలత, తపన్‌సేన్

- కోశాధికారిగా ఎం.సాయిబాబు

శ్యామల్ చక్రవర్తి నగర్ నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

సిఐటియు అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.హేమలత, తపన్‌సేన్, కోశాధికారిగా ఎం.సాయిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగళూరులోని శ్యామల్ చక్రవర్తి నగర్‌లోని కామ్రేడ్ రంజనా నిరులా, రఘునాథ్‌సింగ్ వేదికగా కొనసాగుతున్న సిఐటియు అఖిల భారత 17వ మహాసభ ఆదివారం ముగిసింది. చివరి రోజు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆఫీస్ బేరర్లుగా 39 మంది, 125 మందితో వర్కింగ్ కమిటీ, 425 మందితో జనరల్ కౌన్సిల్ ఏర్పడ్డాయి. ఉపాధ్యక్షులుగా ఎకె.పద్మనాభన్, జి.బేబీరాణి, చుక్క రాములు, ఎ.ఆనందన్, ఎ.సౌందరరాజన్, ఎ.సుందరరాజన్, మెర్సికుట్టి అమ్మ, సుభాష్ ముఖర్జీ, మాణిక్ దే, డిఎల్ కారద్, ఎం.చిట్టిబాబు, ఎస్.వరలక్ష్మి, బిష్ణు మహంతి, ఆర్.లక్ష్మయ్య ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా సిహెచ్.నర్సింగరావు, పాలడుగు భాస్కర్, స్వదేశ్ దేవ్‌రాయ్, ఎలమారం కరీం, కాశ్మీర్‌సింగ్ ఠాకూర్, ప్రశాంతనంది చౌదరి, జి.సుకుమారన్, పి.నందకుమార్, డిడి రామనందన్, ఎఆర్.సింధు, కె.చంద్రన్ పిళ్లై, మీనాక్షి సుందరం, ఉషారాణి, ఎ.సాహు, మధుమిత బందోపాధ్యాయ, అమితవగుహ, ఆర్.కరిమలయన్, తపన్‌శర్మ, ప్రమోద్ ప్రధాన్, కెఎన్.ఉమేశ్, దీపక్ రాజన్, లలిత్ మోహన్ మిశ్రా, సుదీప్ దత్తా ఎన్నుకోబడ్డారు. శాశ్వత ఆహ్వానితులుగా బసుదేవ ఆచార్య, జెఎస్ మజుందార్ ఎన్నికయ్యారు.

ఎపి నుంచి ...

ఆంధ్రప్రదేశ్ నుంచి ఉపాధ్యక్షులుగా జి.బేబీరాణి, కార్యదర్శిగా సిహెచ్.నర్సింగరావు ఎన్నికయారు. వర్కింగ్ కమిటీకి వి.ఉమామహేశ్వరరావు, కె.సుబ్బరావమ్మ, ఎవి.నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి, కె.ఉమామహేశ్వరరావు, ఆర్‌వి.నర్సింహారావు, కెఎం.శ్రీనివాస్, ఎం.బాలకాశి, ముజఫర్ అహ్మద్ ఎన్నికయారు. జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఆర్‌కెఎస్‌వి. కుమార్, కె.మురళి, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, డిఎన్‌విడి ప్రసాద్, కె.అజయ్‌కుమార్, కె.రాజారామ్మోహనరాయ్, జి.కోటేశ్వరరావు, ఎ.నాగరాజు, అంజిబాబు, పి.తేజేశ్వరరావు, మాదాల వెంకటేశ్వరరావు, దయా రమాదేవి, నూర్‌మహ్మద్, సురేశ్.కె, ఎస్.వాణిశ్రీ, ఎన్‌సిహెచ్.సుప్రజ, పి.మణి, పి.నిర్మల, కె.పోసమ్మ, బి.మనోహర్, వై.నేతాజి, రమేశ్, ఇఎస్.వెంకటేశ్ ఎన్నికయారు.

షారుఖ్ ఫోన్ చేశారు

- మాట మార్చిన అస్సాం సిఎం

న్యూఢిల్లీ : షారుఖ్ ఖాన్ ఎవరూ ? అని అడిగిన ఒక రోజు వ్యవధిలోనే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా మాట మార్చారు. షారుఖ్‌ఖాన్ తనకు ఫోన్ చేశారని, అతనికి హామీ ఇచ్చాను అని ఆదివారం ఉదయం హిమంత బిస్వా ట్వీట్ చేశారు. తెల్లవారు జామున 2 గంటల సమయంలో షారుఖ్ తనకు ఫోన్ చేశారని ట్వీట్‌లో తెలిపారు. షారుఖ్‌ఖాన్ కొత్త చిత్రం పఠాన్‌కు వ్యతిరేకంగా నిరసనలు, వివాదాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అస్సాంలోని గౌహతిలోని నరెంగిలోనూ పఠాన్ చిత్రానికి వ్యతిరేకంగా కొంతమంది హిందూత్వ కార్యాకర్తలు ఆందోళనచేశారు. పఠాన్ పోస్టర్లను తగలబెట్టి ఆ చిత్రాన్ని ప్రదర్శించడానికి అనుమతించబోమని హెచ్చరించారు. దీనిపై శనివారం ముఖ్యమంత్రి బిస్వాను విలేకరులు ప్రశ్నించగా.. 'పఠాన్ చిత్రం గురించి నాకు తెలియదు. షారుఖ్‌ఖాన్ ఎవరు' అని ప్రశ్నించారు. అలాగే 'ఈ సమస్య గురించి బాలీవుడ్ నుంచి అనేక మంది నాకు ఫోన్ చేశారు. షారుఖ్‌ఖాన్ ఫోన్ చేయలేదు. ఫోన్ చేస్తే దీని గురించి పరిశీలిస్తా' అని కూడా సమాధానం ఇచ్చారు. తాజాగా ఆదివారం తనకు షారుఖ్ ఫోన్ చేశారని బిస్వా ట్వీట్ చేశారు. రాత్రి 2 గంటల సమయంలో ఫోన్ చేసి, ఈ సమస్య గురించి మాట్లాడారని, శాంతిభద్రతల్ని కాపాడతానని షారుఖ్‌ఖాన్‌కు హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పఠాన్ సినిమా ఈ నెల 25న విడుదల కావాల్సి ఉంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన దీపికా పదుకొనే ఒక పాటలో కాషాయ రంగు బికినీ ధరించడంపై ఆందోళనలు జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్ హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా కూడా సినిమాకు వ్యతిరేకంగా మాట్లాడారు.

ఓటుకు రూ. 6 వేలు ఇస్తాం

- కర్ణాటక బిజెపి నాయకుడి ప్రకటన

బెంగళూరు : మేలో జరగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుకు రూ.6 వేలు చొప్పున ఇస్తామని ఆ రాష్ట్ర బిజెపి నాయకుడు, మాజీ మంత్రి రమేష్ జార్కిహోళి ప్రకటించారు. రూ. 6 వేలు ఇవ్వకపోతే, తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయవద్దని కూడా అన్నారు. బెళగావిలోని సులేబావి గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ఈ మేరకు ప్రకటించారు. బెళగావి జిల్లా గోకాక్ నియోజకవర్గం నుంచి రమేష్ జార్కిహోళి ఎమ్మెల్యేగా ఉన్నారు. అదే జిల్లా బెళగావి గ్రామీణ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న కాంగ్రెస్‌కు చెందిన లక్ష్మీ హెబ్బాల్కర్ బహుమతులు పంచుతున్నారని పేర్కొంటూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళతామని కాంగ్రెస్ తెలిపింది.

భారీ భద్రత మధ్య జమ్ములో రాహుల్ యాత్ర

శ్రీనగర్ : జమ్ములో పేలుళ్ల అనంతరం అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో భారత్ జోడో యాత్ర ఆదివారం పున: ప్రారంభమైంది. ఉదయం ఏడుగంటలకు జమ్ము డివిజన్ కతువా జిల్లా హీరానగర్ నుంచి ప్రారంభమైన యాత్ర నెమ్మదిగా కొనసాగుతోంది. జమ్ముకాశ్మీర్ పార్టీ అధ్యక్షుడు వికార్ రసూల్ వని, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ్ భల్లాలతో పాటు వందలాది మంది పార్టీ కార్యకర్తలు పార్టీ జెండాలతో యాత్రలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు యాత్ర సాంబ జిల్లా చేరుకుంది. రహదారికి ఇరువైపులా వేచి ఉన్న కార్యకర్తలు, పార్టీ మద్దతుదారులు రాహుల్‌కు ఘనంగా స్వాగతం పలికారు.

కాషాయ మూకల దాడుల నుంచి

క్రిస్టియన్ ఆదివాసీలను రక్షించండి

- చత్తీస్‌గఢ్ సిఎంకు సిపిఎం, ఆదివాసీ అధికార్ మంచ్ వినతి
- బాధితులకు నేతల పరామర్శ

బాధితులతో మాట్లాడుతున్న బృందాకరత్ తదితరులు

రాయ్‌పూర్ : బిజెపి, భజరంగ్‌దళ్ గూండాల దాడుల నుంచి రాష్ట్రంలోని క్రిస్టియన్ ఆదివాసీలను రక్షించాలని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్‌కు సిపిఎం, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ బృందం మెమొరాండం అందజేశాయి. దాడులు జరుగుతున్న ఉత్తర బస్తర్ జిల్లాలు కంకెర్, కొడెగాన్, నారాయణ్‌పూర్‌లపై తక్షణమే దృష్టి సారించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ నేతృత్వంలోని సంయుక్త బృందం బాధిత ప్రాంతాల్లో ఈ నెల 20, 21, 22 తేదీల్లో పర్యటించింది. హింసాకాండ బాధితుల్ని, పాస్టర్లను, ఆదివాసీలను, ఆదివాసీల సంఘం సభ్యుల్ని, ఎన్నికైన కొంతమంది స్థానిక సంస్థల ప్రతినిధుల్ని, ఉద్యమకారుల్ని బృందం కలుకుసుకుని, వారితో సమావేశమైంది. కంకెర్ ఎస్‌పి, నారాయణపూర్ కలెక్టర్, కొడెగాన్ ఎస్‌డిఎం, ఇతర అధికారులతో బృందం భేటీ అయింది. ఈ బృందంలో బృందాకరత్‌తోపాటు ధర్మరాజ్ మహాపాత్ర (యాక్టింగ్ సెక్రటరీ, ఛత్తీస్‌గఢ్), బాల్ సింగ్ (రాష్ట్ర కార్యదర్శి, ఆదివాసీ ఏక్తా మహాసభ), నజీబ్ ఖరేషి, వసుందర్ దాస్ ఉన్నారు.

దాడులకు గురైన బాధితులను కలుసుకోవడానికి ఈ ప్రాంతంలో ఒక మంత్రిగానీ, ప్రభుత్వం నుంచి ఒక సీనియర్ నాయకులు గానీ ఇప్పటి వరకూ పర్యటించకపోవడంపై బృందం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. చిన్నారులు, మహిళలతో సహా అనేక మంది దారుణంగా దాడికి గురయ్యారని బృందం ఆందోళన వ్యక్తం చేసింది. సుమారు 1500 మంది బలవంతంగా తమ ఇళ్ల నుంచి, సొంత ఊర్ల నుంచి గెంటివేయబడ్డారని మెమొరాండంలో బృందం పేర్కొంది.

ప్రస్తుతం ఇళ్లకు తిరిగివస్తున్న వారిపైనా కాషాయ మూకలు ఆంక్షలు విధిస్తున్నాయని, క్రిస్టియన్ ఆదివాసీలకు సరుకులు అమ్మేది లేదని దుకాణదారులు హెచ్చరిస్తున్నారని తెలిపింది. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ అంటరానితనం కొనసాగుతోందని గుర్తించినట్లు బృందం వెల్లడించింది. చర్చిలు, క్రిస్టియన్ ఆదివాసీలపై నవంబర్ నుంచి దాడులు ప్రారంభమయ్యాయని తెలిపింది. బిజెపి నాయకులు ఏర్పాటు చేసిన జంజాతి సురక్షా మంచ్, భజరంగ్ దళ్ మూకలే ఈ దాడులకు కారణమని పేర్కొంది. ఈ ఏడాది చివరిలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ ఎజెండాతోనే ఈ దాడులు ప్రారంభమయ్యాయని తెలిపింది. తమ పర్యటనలో అటవీ హక్కుల చట్టం అమలుకాని విషయాన్ని గుర్తించామని బృందం తెలిపింది. నారాయణపూర్ జిల్లాలో రెండు ఐరన్ మైనింగ్ ప్రాజెక్టులను ఆదివాసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపింది. గ్రామ సభల్లో అనుమతి తీసుకోకుండానే ఈ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం ముందుకు వెళుతుందని, ఇది తీవ్ర అభ్యంతరకర విషయమని బృందం తెలిపింది.

అమ్మేటోడెవ్వడు... కొనేటోడెవ్వడు...

- విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ తెలుగు ప్రజలదే
- ఎపి, తెలంగాణ సిఐటియు నేతల ప్రదర్శన

బెంగుళూరు నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

'అమ్మేటోడెవ్వడు... కొనేటోడెవ్వడు... విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ తెలుగు ప్రజల హక్కు...సేవ్ పబ్లిక్ సెక్టార్... సేవ్ ఇండియా... ప్రాణాలైనా అర్పిస్తాం... ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటాం... మీకు చేతగాకపోతే కార్మికులకివ్వండి... మేం నడిపించుకుంటాం' అంటూ సిఐటియు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిఐటియు అఖిల భారత మహాసభ ముగింపు సందర్భంగా ప్యాలెస్ గ్రౌండ్‌లో ఈ రెండు రాష్ట్రాల ప్రతినిధులూ ప్రదర్శన చేపట్టారు. మహాసభ ప్రాంగణం నుంచి మెయిన్ గేటు వరకు సుమారు రెండు వందల మంది ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. విశాఖలో జరుగుతున్న స్టీల్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాటాన్ని ఆపేదే లేదని, ప్రయివేటీకరణను అడ్డుకుని తీరుతామని ప్రతినబూనారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకించారు. ఈ ర్యాలీలో సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, సిఐటియు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, రెండు రాష్ట్రాల నాయకులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ ప్రధానికి షాక్

- న్యాయ వ్యవస్థలో మార్పులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు
- టెల్ అవీవ్‌లో లక్షలాది మందితో ప్రదర్శనలు

టెల్ అవివ్ : ఇజ్రాయిల్ ప్రధాన మంత్రిగా తిరిగి బాధ్యతలు చేపట్టిన అనంతరం బెంజమిన్ నెతన్యాహు తీసుకుంటున్న నిర్ణయాలు ఆ దేశ ప్రజలకు ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి. న్యాయవ్యవస్థలో మార్పులకు యోచిస్తున్న ఆయన ప్రయత్నాలపై ప్రజల నుంచి వ్యతిరేకత ఏర్పడింది. న్యాయవ్యవస్థలో మార్పులు ఆ దేశ సుప్రీంకోర్టును బలహీనపర్చేదిగా ఆరోపిస్తూ ఆ దేశ రాజధాని టెల్ అవీవ్‌లో లక్షలాది మంది నిరసనలో పాల్గొన్నారు. నిరసనల్లో పాల్గొన్నవారు లక్ష మందికి పైగానే ఉంటారని ఇజ్రాయిల్ దేశ మీడియా తెలిపింది. "మా పిల్లలు నియంతృత్వంలో జీవించలేరు" అన్న బ్యానర్లతోపాటు ఆ దేశ జెండాలను నిరసనకారులు ప్రదర్శించారు. నెతన్యాహు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలతో పాటు లాయర్లు, పౌర హక్కుల కార్యకర్తల నుంచి వ్యతిరేకతను తీసుకొచ్చింది. "వారు మమ్మల్ని నియంతృత్వంలోకి మార్చాలనుకుంటున్నారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలనుకుంటున్నారు. న్యాయవ్యవస్థ అధికారాన్ని నాశనం చేయాలనుకుంటున్నారు. న్యాయపరమైన అధికారం లేకుండా ప్రజాస్వామ్య దేశం లేదు" అని ఇజ్రాయెల్ బార్ అసోసియేషన్ హెడ్ అవీ చిమి అన్నారు.

నానీ పాల్కివాలా అవార్డు నగదు

హర్ష మందర్ ఎన్జీవోకు

- మాజీ ఐపిఎస్ జూలియో రెబీరో దానం



జూలియో రెబీరో

న్యూఢిల్లీ : మాజీ ఐపిఎస్ అధికారి జూలియో రెబీరో తనకు వచ్చిన నానీ పాల్కివాలా అవార్డులో నగదును హక్కుల కార్యకర్త హర్ష మందర్‌కు చెందిన ఎన్జీవోకు దానం చేయనున్నారు. ఈ విషయాన్ని ఆయనే తెలిపారు. " ప్రస్తుతం ఒక ప్రభుత్వ ఏజెన్సీ హర్ష మందర్‌ను తన కార్యాలయానికి రమ్మని తాఖీదును ఇచ్చింది. అధికారానికి ఎవరో ఒకరు అడ్డుగా నిలవాలి. హర్ష మందర్ చేస్తున్నట్టుగానే ప్రతి ఒక పౌరుడూ గొంతు విప్పాలి. ఇలా చేస్తే ప్రభుత్వం దారిలోకి వస్తుంది" అని రెబీరో అన్నారు. బాంబే బార్ అసోసియేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2021, సెప్టెంబర్‌లో దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వసంత్ కుంజ్‌లోని హర్ష మందర్ ఇళ్లు, అడ్చినిలోని ఆయన కార్యాలయం, మెహ్రౌలీలో ఆయన సంస్థ సెంటర్ ఫర్ ఈక్విటీ స్టడీస్ సహాయంతో ఏర్పాటు చేయబడిన చిల్డ్రన్స్ హోంపై దాడులు చేసిన విషయం తెలిసిందే. ఇడి చర్యను ఆ సమయంలో 500 మందికి పైగా విద్యావేత్తలు, కార్యకర్తలు, మేధావులు ఖండించారు పద్మభూషణ్ అవార్డు గ్రహీత కూడా అయిన రిబీరో ముంబయి పోలీసు కమిషనర్‌గా పని చేశారు. అలాగే, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలు, సిఆర్‌పిఎఫ్ డీజీగా కూడా విధులు నిర్వర్తించారు. 1986, 1991 సంవత్సరాల్లో ఆయనపై రెండు సార్లు హత్యాయత్నాలూ జరిగాయి.

బ్రెజిల్ ఆర్మీ చీఫ్ తొలగింపు

బ్రసీలియా : బ్రెజిల్ ఆర్మీ చీఫ్ జనరల్ జూలియో సిజర్ డె అర్రుడాను ఆ పదవి నుండి ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు ఆ దేశ సైన్యం అధికారిక వెబ్‌సైట్ వెల్లడించింది. జూలియో స్థానంలో జనరల్ టొమస్ మిగ్యూల్ రెబెరో పైవాను నియమించినట్లు పేర్కొంది. ఈనెల 8న మాజీ అధ్యక్షుడు బోల్సనారో మద్దతుదారులు రాజధాని బ్రసిలియాలో విధ్వంసం సృష్టించిన సంగతి తెలిసిందే. అధ్యక్ష భవనం, నేషనల్ కాంగ్రెస్, సుప్రీంకోర్టుపైనా దాడి చేశారు. ఈ దాడి వెనుక సైన్యం హస్తం ఉందని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా విమర్శించారు. తిరుగుబాటుకు సహకరించిన వారిపై చర్యలు ఉంటాయని వెల్లడించారు.

మోడీపై విమర్శతో నృత్య ప్రదర్శనకు నిరాకరణ



మల్లికాసారాభాయ్

న్యూఢిల్లీ : మోడీని విమర్శించినందునే తన నృత్య ప్రదర్శనకు అనుమతి నివ్వలేదని ప్రముఖ శాస్త్రీయ నృత్యకారిణి మల్లికాసారాభాయ్ తెలిపారు. ఈ నెల కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వ్యవస్థాపకులకు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చిందని మల్లికాసారాభాయి ఆదివారం పేర్కొన్నారు. వరంగల్‌లోని రామప్ప ఆలయంలోని ప్రదర్శకుల జాబితా నుంచి ఆమె పేరు తొలగించాలని లేదా వేడుకను రద్దు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. బిజెపి, దాని హిందూ మతతత్వ రాజకీయ వైఖరిని విమర్శించినందునే తన ప్రదర్శనకు అనుమతి నిరాకరించారని ఆమె పేర్కొన్నారు. . "ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించే తత్వం ఇక్కడి ప్రజల డిఎన్ఎలోనే ఉంది. అది ఉండాలి కూడా. వేదాంతాలు, ఉపనిషత్తులు ప్రశ్నించే తత్వం నుంచి వచ్చాయే తప్ప అంధ విశ్వాసాలతో కాదు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కుప్పకూల్చాలనుకునే ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నా స్వరం వినిపిస్తూనే ఉంటాను.

20 ఏళ్లుగా అదే పని చేస్తున్నాను" అని మల్లికా అన్నారు. రామప్ప ఆలయం ప్రపంచ వారసత్వ గుర్తింపు పొంది ఏడాది పూర్తయిన సందర్భంగా కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'రామప్ప ఫెస్ట్' పేరుతో ఓ వేడుకను నిర్వహించాలని నిర్ణయించింది. "నాట్య ప్రదర్శనకు అనుమతి కోరుతూ మూడు నెలల కిందే అర్కియాలజీ డిపార్ట్మెంట్‌కు దరఖాస్తు చేశాం. అయితే అనుమతి లభించలేదు. మల్లికా సారాభాయ్ నృత్య ప్రదర్శన ఉండటం వల్లే పర్మిషన్ ఇవ్వలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఓరల్ గా చెప్పారు. కళలకు రాజకీయాలకు సంబంధం లేదు. ఉండకూడదు. ఇది దురదృష్టకరం" అని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పేర్కొన్నారు.

MOTILAL OSWAL HOME LOANS

మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టార్ ఆఫీసు: మోతిలాల్ ఓస్వాల్ టవర్, రహిమ్‌తుల్లా సయాని రోడ్, పారెల్ ఎస్‌టి డిపోట్ ఎదురుగా, ప్రభాదేవి, ముంబయి-400025. టెలి: (022) 47189999,
Website: www.motilaloswalhf.com, Email: hfquery@motilaloswal.com

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి/ల కొరకు)

ఏదైతే అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ యొక్క దిగువ సంతకందారుడైన ఆధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఇన్ కంప్లియన్స్ ఆఫ్ రూల్ 8(1) ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి సదరు నోటీసు/ల స్వీకరణ యొక్క నోటీసు(ల)/ తేది నుండి 60 రోజులలోగా ప్రతి ఖాతా ఎదురుగా పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించమని సంబంధిత రుణగ్రహీత/లు పిలుస్తూ ప్రతి ఖాతా ఎదురుగా పేర్కొన్న తేదిన డిమాండ్ నోటీసు/లు జారీ చేయబడినాయి.
రుణగ్రహీత/లు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం చెందినారు, సెక్యూరిటీ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి క్రింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారుడు స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/లు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
సదరు ఆస్తి/లతో ఏవిధమైన లావాదేవీలు నిర్వహించరాదని, సదరు ఆస్తి/లతో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ యొక్క చార్జ్‌కు లోబడి మాత్రమే జరుగవలెనని ప్రత్యేకించి రుణగ్రహీత/లు మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది. రుణగ్రహీతలకు గమనించాల్సిందేమనగా ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు ఉన్నంత సమయంలో చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలకు అహ్వానించడమైనది.

క్ర. సం	లోన్ గ్రిమెంట్ నెం./రుణగ్రహీత పేరు/సహ రుణగ్రహీత/హామీదారుడు	డిమాండ్ నోటీసు తేది & మొత్తం	స్వాధీనం చేసుకున్న తేది	తనఖాపెట్టిన ఆస్తు/ల వివరణ
1	LXVIJ00417-180056215 రాధ రామారావు వరికుటి మరియు నాగు రామారావు వరికుటి	25-05-2021 for Rs. 2176195/-	17-01-2023	ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-2, 1వ అంతస్తు, విజయ్ దుర్గా రెసిడెన్సీ, ఆర్.ఎస్.నం.-117/2ఎ, 117/3ఎ, నిడమానూరు గ్రామ పంచాయతీ, విజయవాడ రూరల్, కృష్ణ, ఆంధ్రప్రదేశ్-521104.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
తేది: 23.01.2023
సం/- అధీకృత అధికారి,
(మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్)
*అనువాదంలో వ్యత్యాసం ఉన్నట్లయితే, ఇంగ్లీష్ వర్షన్‌ను పరిగణించగలరు.

Chola Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్: 1వ ఫ్లోర్, 'డేర్ హౌస్', నెం.2, ఎన్ఎస్‌సి బోస్ రోడ్, చెన్నయ్ 600001

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (చట్టం)తో పాటు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (రూల్స్) నిబంధనల మేరకు జారీ చేసిన

పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(12తో పాటు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం సంక్రమించిన అధికారాలతో దిగువ సంతకందారైన చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌కు చెందిన అధీకృత అధికారి దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలకు వారు సంస్థ నుండి పొందిన రుణసౌకర్యమునకు సంబంధించిన బకాయిలను నోటీసు అందిన 60 రోజుల్లోగా పూర్తిగా చెల్లించాలని కోరుతూ పై చట్టంలోని సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అయితే వారు ఉద్దేశపూర్వకంగానే డిమాండ్ నోటీసులను నిరాకరిస్తున్నారని భావించిన దిగువ సంతకందారైన చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ అధీకృత అధికారి నిబంధనల మేరకు డిమాండ్ నోటీసును పత్రికా ప్రకటన ద్వారా వారికి తెలియచేస్తున్నారు. డిమాండ్ నోటీసు వివరాలు ఈ దిగువ పేర్కొన్న విధంగా వున్నాయి.

క్ర. నెం.	రుణగ్రహీత/సహరుణగ్రహీతల పేరు, చిరునామా	రుణ మొత్తము.	డిమాండ్ నోటీసు తేదీ, బకాయి మొత్తం	తనఖా/స్వాధీనం చేసుకోబోయే ఆస్తి వివరాలు
1	Loan A/c. No(s). : HL01GUT000026900 & HL11GUT000046536 1. సతీష్ పులిపాటి, 2. లలితప్రియ పులిపాటి, డోర్ నెం.14-6-12/1, 4వ లైను, నేతాజీ నగర్, ఐడియల్ కాన్వెంట్ వద్ద, పొన్నూరు, ఆంధ్రప్రదేశ్ 522124 తోపాటు డోర్ నెం. 90/3బి2/డోర్ నెం.14-15-2, ఫ్లాట్ నెం.501 (నాల్గవ ఫ్లోర్), వృషభాద్రి టవర్స్, వెంకటేశ్వర నగర్, జిబిసి రోడ్, నిడుబ్రోలు గ్రామం, పొన్నూరు మున్సిపాలిటీ, గుంటూరు [illegible]	₹ 18,00,000/- & ₹ 4,00,000/-	4. ది.12-01-2023, ది.11-01-2023 నాటికి రు.18,74,966/- - రు.4,22,675/- - మొత్తం రు.22,97,641/- - (ఇరవై రెండు లక్షల తొంభై ఏడు వేల [illegible])	5. ఎ. షెడ్యూలు: గుంటూరు జిల్లా, గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, పొన్నూరు సబ్ రిజిస్ట్రీ, పొన్నూరు మున్సిపల్ ఏరియా, నిడుబ్రోలు గ్రామం, డోర్ నెం.90/3బి2, లోని మొత్తం ఎ.0.75 సెంట్లలో డోర్ నెం.14-15-2 వద్ద వున్న 1402.34 చ.గజాల విస్తీర్ణం కలిగిన స్థలం. హద్దులు: తూర్పు. పాములపాటి అంకినీడు ప్రసాద్ ఇతరులకు విక్రయించిన ఆస్తి 143'.3", దక్షిణం. రోడ్ (సర్కారు డొంక) 126'.0", పశ్చిమం. పాములపాటి శివప్రసాద్‌కు చెందిన స్థలంతో పాటు యలవర్తి సాయిసుధకు చెందిన స్థలంలో కొంత భాగం 100'.4", ఉత్తరం. ఆకుల కంపెనీకి చెందిన స్థలం 104'.11", మళ్లీ పశ్చిమం. ఆకుల కంపెనీకి చెందిన స్థలం 53.5 1/2". ఈ హద్దులలో మొత్తం 1402.34 చ.గజాల స్థలంలో అనిర్దేశిత, అవిభక్త స్థలం 56.09 చ.గజాలు. బి షెడ్యూలు: పైన పేర్కొన్న ఎ షెడ్యూలు ఆస్తిలో 'వృషభాద్రి టవర్స్' పేరిట నిర్మితమైన [illegible]

[illegible]

స్థలం: గుంటూరు, ఆంధ్రప్రదేశ్
తేది: 23-01-2023
అధీకృత అధికారి
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున

మీకోసం

పెయింట్ వేసే బ్రష్‌లు గట్టి పడితే షాంపు నీటిలో కాసేపు ఉంచి కడగాలి.

జీవన సౌరభం

మీ ఆలోచనలు మీ మాటల్లో ప్రతిబింబిస్తాయి. కాబట్టి మీ ఆలోచనలు ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలి.

సైకిల్



పేదవాని చైతన్య రథం సైకిల్
దీనికుండేది రెండు చక్రాల్
దీనికి వద్దు డీజిల్ , పెట్రోల్
ఇది మానవ శక్తితో నడిచే
వెహికల్ !

ఎన్నో రెట్లు మోసేను బరువుల్
ఏ దారిలోనైన పెట్టేను పరుగుల్
ఎవరడ్డొచ్చినా మ్రోగేను
ట్రింగ్ ట్రింగ్ బెల్ !

రెండు కాళ్ళతో తొక్కాలి పెడల్
రెండు చేతులతో తిప్పాలి హ్యాండిల్
దీన్ని ఇష్టంగా తొక్కుతారు పిల్లల్
దీన్ని ఎక్కడైనా పార్క్ చేయడంలో
లేవు ఇబ్బందుల్ !

దీన్ని రోజూ తొక్కితే రోగాలు కిల్
దీన్ని రోజూ తొక్కితే తగ్గును పొట్టల్
ఒలంపిక్స్‌లో నిర్వహిస్తారు
సైకిల్ పోటీల్

పల్లె నుంచి ప్రపంచం వరకు
ఇప్పటికీ, ఎప్పటికీ దీనికి సాటి
లేదు ఏ వెహికల్ !

ప్రతి ఇంట్లో ఉండాలి
ఆరోగ్యాన్నిచ్చే సైకిల్
ఈ కాలుష్య రహిత సైకిల్
వాడాలి ప్రతి ఒక్కరూన్ ...

– బోనగిరి పాండు రంగ, తొర్రూరు

సరైన నీడ ఏది?

చిన్నారులూ, ఇక్కడ బుజ్జి కుక్కపిల్ల ఉంది. దాని పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో దీని సరైన నీడను కనిపెట్టండి.

జవాబు: 2

నేను గీసిన బొమ్మ

ఎస్. నవతేజ్, 1వ తరగతి ఎంపియుపి స్కూలు, జొన్నాడ, విజయనగరం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈ బామ్మ ... పెళ్లి దుస్తుల డిజైనర్

పెళ్లి వేడుకల్లో వధూవరులు ప్రత్యేక వస్త్రాలు, ఆభరణాలు ధరించి అందరి కన్నా ఆకర్షణగా నిలుస్తారు. జీవితంలో చేసుకునే ముఖ్యమైన వేడుక అంటూ వాటికోసం భారీ మొత్తంలో ఖర్చుపెడతారు. మరి అంత డిమాండ్ ఉన్న ఆ వస్త్రాలను, ఆభరణాలను డిజైన్ చేయాలంటే ఆ కోర్సులో శిక్షణ, అనుభవం ఉండాలి. ఇవేమి చేయకుండానే రాధేశర్మ మంచి డిజైనర్‌గా గుర్తింపు పొందారు. రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. 90 ఏళ్ల వయసులోనూ కష్టపడుతూ ఆమె అందరికీ ప్రేరణగా నిలుస్తున్నారు.

మణిపూర్‌లోని తౌబల్ జిల్లాలోని వాంగ్‌జింగ్ గ్రామానికి చెందిన హంజాబామ్ ఒంగ్బీ రాధే శర్మ పేద కుటుంబంలో పుట్టింది. తండ్రి ఆలయ పూజారి. తల్లి గృహిణి. ఐదుగురు పిల్లల్లో తాను మూడో సంతానం. పెద్ద కుటుంబం కావడంతో ఆమెను పెద్దగా చదివించలేదు. 13 ఏళ్లకే పెళ్లిచేసి పంపారు. రాధే భర్త వంటపుట్టు. శుభకార్యాలు జరుగుతున్నప్పుడే ఆయనకు ఉపాధి దొరుకుతుంది. మిగిలిన రోజుల్లో ఇల్లు గడవడం కష్టమయ్యేది. ఆ క్రమంలో ఆమె ఇంటి ముందు కొట్టుపెట్టి టీ అమ్మింది. ఐదుగురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు పుట్టారు. పిల్లలను పోషించేందుకు భర్త తెచ్చె ఆదాయం సరిపోయేది కాదు. తినీ తినక బిడ్డలకు అన్నం పెట్టుకునేది. అందరినీ చదివించాలంటే కష్టమనిపించింది. తాను చదువుకోకపోయినా పిల్లల్ని మాత్రం చదివించాలని, కడుపునిండా అన్నం పెట్టాలన్న కోరికతో మరో ఉపాధి మార్గం వెతికింది.

ఇష్టంగా నేర్చుకుని

రాధే ఇంటికి దగ్గర్లో సంప్రాదాయ కళాకారులు ఉన్నారు. వారి దగ్గర పొట్లోయ్ సెట్పిలో శిక్షణ తీసుకున్నారు. వస్త్రాలపై డిజైనింగ్. చేతివృత్తి పనికావడంతో మొదట్లో బాగా కష్టపడ్డారు. కళ్లు మంటలు, తల నొప్పి వచ్చేవి. భరిస్తూనే వస్త్రాలపై డిజైన్ చేసేవారు. అక్కడే రోజువారీ కూలిపనికి వెళ్లింది. వచ్చిన డబ్బుతో పిల్లలను కుటుంబాన్ని పోషించింది. పండగవేళల్లో పిల్లల కోసం నిద్రపోకుండా మరింత కష్టపడింది.

ఈ క్రమంలో బ్రైడల్ డ్రెస్‌ల డిజైన్ పై ఆసక్తి పెంచుకుని శిక్షణ పొందింది.

డిమాండ్ ఉన్న మణిపూర్ మెయిటీ కమ్యూనిటీ సాంప్రదాయ పెళ్లి దుస్తులు, అభరణాల తయారీలో కొత్త మెలకువలు నేర్చుకుంది. పెళ్లిళ్ల సీజనులో క్షణం తీరిక లేకుండా బాగా శ్రమించేవారు. అప్పట్లో రోజంతా కష్టపడితే రూ.10 కూలి ఇచ్చేవారు. ఐదేళ్ల తర్వాత స్వయంగా వ్యాపారం ప్రారంభించింది. మొదట భర్త బిజినెస్ వద్దని వారించాడు. తల్లిదండ్రుల మద్దతుతో పెట్టుబడి పెట్టి ఆమె అడుగు ముందుకు వేసింది. రాధే సృజనాత్మకమైన డిజైన్లతో పెళ్లి దుస్తులు మరింత ఆకర్షణగా కుట్టి వినియోగదారుల ప్రశంసలు అందుకొంది. ఆమె పనితనం మెచ్చి చాలామంది ఆమె దగ్గరే పెళ్లిబట్టలు కొనుగోలు చేసేవారు. 15–20 రోజులు పట్టే దుస్తుల తయారీకి ఆ రోజుల్లో రూ.150 వచ్చేది. ప్రతిరోజూ వస్త్రాలను, అభరణాలను ఇంటిముందు వేసి, తయారీలో నిమగ్నమవుతున్న రాధేను చూస్తూ పెరిగిన పిల్లలూ ఈ కళను నేర్చుకున్నారు.

భర్త మరణం...

పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే ఆమె భర్త మరణించాడు. దాంతో ఆమె మానసికంగా కుంగిపోయింది. పిల్లల ముఖం చూస్తూ ఏడ్వని రోజంటూ లేదు. వారి కోసం ధైర్యం తెచ్చుకుని మళ్లీ వ్యాపారం కొనసాగించింది. కాని ఆ సమయంలో ఆమెను పెళ్లి వస్త్రాలు తయారీ చేయొద్దని చుట్టుపక్కల వారు, తోటి వ్యాపారులు సూచించారు. మరొక పని వెతుక్కోమని సలహాలూ ఇచ్చారు. అయినా రాధే ఎంతో ఇష్టంగా నేర్చుకున్న విద్యను వదులుకోలేదు. మణిపూర్ సంస్కృతి ఉట్టిపడేలా తన బట్టలను మరింతగా డిజైన్ చేసేవారు. అంతేకాదు.. తనలాంటి ఒంటరి మహిళలకూ, అనేక మంది యువతకు శిక్షణ ఇచ్చి వారి కుటుంబాల ఆదాయానికి కారణమయ్యారు. డిజైనింగ్‌లో ఆమె ప్రతిభను గుర్తించిన అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలకు ఏకరూప దుస్తుల తయారీకి పురమాయించేవారు.

దాంతో పెళ్లి దుస్తులతో పాటు, రాస్ లీలా శాస్త్రీయ నృత్యం కోసం, మణిపూర్‌లో జరుపుకునే వివిధ పండుగలకు కూడా రాధే దుస్తులు డిజైన్ చేశారు. మారుతున్న జనరేషన్‌కు తగ్గట్టుగా, సంప్రదాయ దుస్తుల డిజైన్లను ఆకర్షణీయంగా ఆమె మార్చేది. కుటుంబంలో కీలకంగా నిలబడి పిల్లలను మంచిగా చదివించి, వారి ఎదుగుదలకు కృషిచేశారు. ప్రాచీన సంస్కృతి మరుగున పడకూడదన్న సంకల్పంతో కళను యువతకు నేర్పిస్తూ, మహిళలకు ఉపాధి కల్పిస్తున్న రాధేకు అధికారులు గత ఏడాది పద్మశ్రీ అవార్డు అందజేశారు.

వృద్ధాప్యంలోనూ...

రాధేకు వయస్సు పెరుగుతున్న కొద్ది చూపు మందగించింది. దాంతో ఇంటికి వచ్చిన కోడళ్లు ఆమె వారసత్వంగా వ్యాపారాన్ని బాధ్యతగా కొనసాగిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం పెద్దకొడుకు అనారోగ్యంతో చనిపోయాడు. దాంతో కొడుకు కుటుంబానికి అండగా నిలిచి వారి పిల్లల పెళ్లిళ్లు చేశారు. ఇప్పుడు ఆమెకు తోడుగా పిల్లలతో పాటు 24 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఇప్పుడు రాధేకు 90 ఏళ్లు. అయినా ఇప్పటికీ డిజైన్ల విషయంలో కోడళ్లకు, తోటి డిజైనర్లకు సలహాలు ఇస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ఆరోగ్యానికి గుమ్మడి

- ఈ సీజన్‌లో దొరికే గుమ్మడికాయల్లో ఉండే విటమిన్ సి, పొటాషియం, ఫైబర్‌లు గుండె ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి. హైబీపీని తగ్గిస్తాయి. గుండె జబ్బులు రాకుండా చూస్తాయి.
- గుమ్మడికాయల్లో ఉండే ఫైబర్ అధిక బరువు తగ్గేందుకు సహాయపడుతుంది. ఈ ఫైబర్ నెమ్మదిగా జీర్ణం అవడం వల్ల చెక్కరస్థాయి కూడా తగ్గుతాయి. ఫలితంగా ఆకలి నియంత్రణలో ఉంటుంది. వీటిల్లో 90 శాతం నీరే ఉంటుంది. అందువల్ల క్యాలరీలు కూడా తక్కువగా లభిస్తాయి.
- గుమ్మడికాయల్లో బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. దీనివల్ల కంటి ఆరోగ్యం సురక్షితంగా ఉంటుంది. గుమ్మడి కాయల్లో ఉండే లుటీన్, జియాంతిన్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు కళ్లలో శుక్లాలు రాకుండా చూస్తాయి.
- గుమ్మడికాయల్లో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. దగ్గు, జలుబు వైరస్‌ల బారి నుంచి రక్షణ లభిస్తుంది. ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి.
- గుమ్మడికాయల్లో ఉండే బీటా కెరోటిన్ సూర్యుని నుంచి వచ్చే అల్ట్రా వయొలెట్ (అతి నీలలోహిత) కిరణాల బారి నుంచి మన చర్మాన్ని సంరక్షిస్తుంది. గుమ్మడికాయ గుజ్జును ఫేస్ మాస్క్‌గా వేసుకుంటే చర్మం సురక్షితంగా ఉంటుంది. మొటిమలు, మచ్చలు పోతాయి.
- ఇందులో బీటా కెరోటిన్, విటమిన్ సి, ఎ, యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్లకు కారణం అయ్యే ఫ్రీ ర్యాడికల్స్ ను నాశనం చేస్తాయి. గుమ్మడికాయలను తరచూ తినడం వల్ల ప్రోస్టేట్, ఊపిరి తిత్తుల క్యాన్సర్లు రాకుండా ఉంటాయని సైంటిస్టుల అధ్యయనాల్లో వెల్లడైంది.

సంక్రాంతి సినిమా పండగ

ఈ ఏడాది సినిమా ప్రేక్షకులకు సంక్రాంతి పండగ ఎంతో సరదానిచ్చింది. చాలా ఏళ్ల తరువాత చిరంజీవి, బాలకృష్ణ సినిమాలు ఈ సంక్రాంతి బరిలో నిలిచాయి. 1985 నుండి ఇప్పటి వరకు మొత్తం 9సార్లు పోటీపడిన ఈ ఇద్దరు హీరోలు ఈ ఏడాది పదోసారి సంక్రాంతి ఫైట్‌కి సిద్ధమై అభిమానులను ఖుషీ చేశారు. అలాగే యువ నటుడు సంతోష్ శోభన్ నటించిన 'కళ్యాణం కమనీయం', తమిళ నటులు అజిత్, విజయ్‌ల 'తెగింపు', 'వారసుడు' చిత్రాలు సంక్రాంతి పోటీలో నిలిచాయి.

బాలకృష్ణ వీరాభిమానిగా గోపీచంద్ మలినేని తెరకెక్కించిన 'వీర సింహారెడ్డి' చిత్రం బాలయ్య ఫ్యాన్స్ కోరుకునే అంశాలతో విడుదలైంది. ఫ్యాక్షన్ కథలకు కేరాఫ్ అడ్రస్‌గా 'సమరసింహారెడ్డి', 'చెన్నకేశవ రెడ్డి', 'నరసింహానాయుడు' వంటి ఎన్నో సినిమాల్లో చూసినట్లుగానే బాలకృష్ణ ఈ సినిమాలో కూడా కనిపిస్తారు. అయితే ఈ సినిమాలో చెల్లి సెంటిమెంట్‌ను కొత్తగా చూపించారు దర్శకుడు. చెల్లి పాత్రలో వరలక్ష్మీ శరత్‌కుమార్ కనబర్చిన నటన ఆమెకు ఎంతో పేరుతెచ్చిపెడుతుంది. కథ విషయానికొస్తే.. ఊరు బాగు కోసం కత్తి పట్టిన అన్న, అతన్ని చంపి పగ తీర్చుకోవాలనుకుని 30 ఏళ్లుగా ఎదురుచూసే చెల్లి పాయింట్ ప్రేక్షకుల్లో ఆసక్తిరేకెత్తిస్తుంది. అయితే సినిమా మొదట్లో పెద్దగా కథ కనిపించదు. జై పాత్ర పరిచయం తరువాత హీరోయిన్ పాత్ర పరిచయ సన్నివేశాలైతే విసుగు తెప్పించేలా ఉంటాయి. ఎన్నోసార్లు ఎన్నో సినిమాల్లో చూసినట్లుగానే ఉంటాయి. ఇక వీరసింహారెడ్డి, జై పాత్రలతో తండ్రీకొడుకులుగా నటించిన బాలకృష్ణ ఎక్కువగా 'వీర' పాత్రలోనే కనిపిస్తారు. ఆయన పాత్ర కనిపించినప్పటి నుండి విపరీతమైన ఎలివేషన్లు, యాక్షన్ ఎపిసోడ్లతో కథ సాగుతుంది. అన్న మీద చెల్లి పెంచుకున్న వైరం, చెల్లి మీద అన్న పంచే అనురాగం ఇదివరకు చాలా సినిమాల్లో చూసిందే.. ఇక సాధారణంగానే బాలకృష్ణ సినిమాల్లో కనిపించే హింసాత్మక ఫైట్లు, భారీ డైలాగులు ఈ సినిమాలో కూడా చూపించారు. కేవలం బాలకృష్ణ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకునే గోపీచంద్ ఈ సినిమాను తెరకెక్కించి నట్లు కనపడు తుంది.

ఒక రోజు తేడాతో విడుదలైన చిరంజీవి 'వాల్తేరు వీరయ్య' ఎలా ఉందంటే.. చిరంజీవి అభిమానిగా బాబీ తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చింది. ప్రేక్షకులు చిరంజీవిని ఎలా కోరుకుంటారో ఈ చిత్రంలో ఆయన అలా కనిపిస్తారు. చిరంజీవి నుండి కోరుకునే కామెడీ, డ్యాన్సులు వీరయ్య పాత్రలో చూసిన అభిమానులు తెగ ఖుషీ అయ్యారు. కథ విషయానికొస్తే.. వైజాగ్ జాలరిపేటలో ఉండే వీరయ్య తన ప్రాంతం వారికి తలలో నాలుకలా ఉంటాడు. ఐస్ ఫ్యాక్టరీ నడిపిస్తుంటాడు. ప్రథమార్థమంతా చిరంజీవి పాత్ర ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా సాగుతుంది. చిరంజీవి అండ్ కో మధ్య వచ్చే కామెడీ సన్నివేశాలు కడుపుబ్బా నవ్విస్తాయి. కథలో డ్రగ్ మాఫియాను చూపించిన విధానం కూడా ఆసక్తికరంగా సాగుతుంది. మాఫియా డాన్‌ను పట్టుకునేందుకు వీరయ్య మలేషియా వెళ్లిన దగ్గర నుండి అసలు కథ మొదలవుతుంది. సెకండాఫ్‌లోనే రవితేజ పాత్ర పరిచయ మవుతుంది. ఆ పాత్ర ప్రవేశించినప్పటి నుండి కథ మరో మెట్టు ఎక్కినట్లుగా ప్రేక్షకులు భావిస్తారు. వీరయ్యగా చిరంజీవి, వీర సాగర్‌గా రవితేజ మొదట్లో ఒకరంటే ఒకరు పడనట్లుగా కనిపించి ఆ తరువాత వాళ్లిద్దరూ ఒకే తండ్రి బిడ్డలని, తల్లులు వేరని ఇచ్చిన ట్విస్ట్ సినిమాకు హైలెట్. చిరంజీవి, రవితేజ పాత్రలు కనిపించినప్పటి నుండి వచ్చే డైలాగులు, పాటలు అభిమానులను అలరించాయి.

ఇక ఈ రెండు చిత్రాల గురించి కొన్ని ఆసక్తికర విషయాలు ఒకసారి పరిశీలిద్దాం.

రెండు చిత్రాలు ఒకే నిర్మాణసంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. రెండింటిలోనూ శృతి హాసనే కథానాయిక. ఫైట్ మాస్టర్లు కూడా రామ్–లక్ష్మణ్. అలాగే రెండు సినిమాల్లోనూ రవితేజ, వరలక్ష్మి ప్రత్యేక పాత్రలు.. వాటిచుట్టూ కథను నడిపించడం..

అనువాద చిత్రాలైన 'తెగింపు', 'వారసుడు' చిత్రాలు మూసకథలతో తెరకెక్కి పెద్ద హీరోల దెబ్బకు చతికిలపడ్డాయి. సంతోష్ శోభన్ నటించిన 'కళ్యాణం, కమనీయం' చిత్రం పరవాలేదనిపిస్తుంది. ఏదేమైనా పెద్ద హీరోల సినిమాలతో ఈ సంక్రాంతి సినీ ప్రేక్షకులకు సినిమా పండగ తెచ్చింది.

భారత్ ఆశలపై నీళ్లు

- క్రాస్ ఓవర్ మ్యాచ్‌లో ఓటమి
- షూటౌట్‌లో గెలిచిన కివీస్

భువనేశ్వర్ : స్వదేశంలో జరుగుతున్న పురుషుల హాకీ ప్రపంచకప్ నుంచి భారత్ జట్టు నిష్క్రమించింది. ఈ టోర్నీలో నిలవాలంటే తప్పకుండా గెలవాల్సిన క్రాస్ ఓవర్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో భారత్ పరాభవం చవిచూసింది. ఆదివారం ఇక్కడి కళింగ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరు జట్లు 3–3తో సమంగా నిలిచాయి. దీంతో ఫలితం కోసం షూటౌట్ నిర్వహించగా 5–4తో న్యూజిలాండ్ విజయం సాధించింది. 48 ఏళ్ల భారత్ ప్రపంచకప్ టైటిల్ ఆశలపై నీళ్లు జల్లింది.

ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలి అర్ధభాగం ముగిసే సరికి భారత్ 2–1తో ఆధిక్యంలో నిలిచింది. అయితే తరువాత న్యూజిలాండ్ రాణించడంతో రెండో అర్ధ భాగం కూడా ముగిసే సరికి 3–3తో మ్యాచ్ టైగా నిలిచింది. షూటౌట్ నిర్వహించారు. ఈ విజయంతో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న న్యూజిలాండ్ మంగళవారం ఆ మ్యాచ్‌లో బెల్జియంతో తలపడుతుంది. ఆదివారం ముందుగా జరిగిన మరో క్రాస్ ఓవర్ మ్యాచ్‌లో మలేషియాపై షూటౌట్‌లో స్పెయిన్ 4–3తో విజయం సాధించింది. మంగళవారం జరిగే క్వార్టర్ ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో స్పెయిన్ తలపడుతుంది.

ఇండియా ఓపెన్ విజేత కున్లావుట్ విటిడ్‌సర్న్

- ఫైనల్‌లో విక్టర్ అక్సెల్‌సెన్‌కు షాక్

న్యూఢిల్లీ : ఇండియా ఓపెన్ బ్యాడ్మింటెన్ టైటిల్‌ను థాయిలాండ్ యువ ఆటగాడు కున్లావుట్ విటిడ్ సర్న్ సొంతం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో టాప్ సీడ్ విక్టర్ అక్సెల్‌సెన్‌కు కున్లావుట్ షాకిచ్చిడు. 22–20, 10–21, 21–12 స్కోరుతో విటిడ్‌సర్న్ విజయం సాధించాడు. అలాగే మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ యమగుచికి దక్షిణ కొరియా క్రీడాకారిణి అన్ సేయాంగ్ విజయం సాధించింది. 62 నిమిషాల పాటు సాగిన ఫైనల్ మ్యాచ్‌లో యమగుచిని 15–21, 21–16, 21–12 స్కోరుతో సేయాంగ్ మట్టి కరిపించింది.

మూడో ర్యాంక్‌కు టీమిండియా

దుబాయ్: న్యూజిలాండ్ మీద వరుసగా రెండు వన్డేలు గెలిచిన భారత క్రికెట్ జట్టు ఐసిసి ర్యాంకింగ్స్‌లోనూ దూసుకుపోతోంది. సిరీస్‌ను కోల్పోయిన కివీస్ వన్డేల్లో రెండో స్థానానికి పడిపోయింది. తాజాగా ఐసిసి విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత్ మూడో స్థానానికి ఎగబాకింది. ప్రస్తుతం ఇంగ్లాండ్ (113) అగ్రస్థానంలో ఉంది. కివీస్, భారత్ కూడా 113 పాయింట్లతో సంయుక్తంగా ఉన్నప్పటికీ కొద్దిపాటి తేడాతో రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఆస్ట్రేలియా (112), పాకిస్థాన్ (106) టాప్–5లో ఉన్నాయి.

భారత్– కివీస్ రెండో వన్డేకు ముందు.. న్యూజిలాండ్ 115 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండేది. భారత్ 111 పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగేది. అయితే కివీస్ ఓడిపోవడం.. భారత్ విజయం సాధించడంతో ఇంగ్లాండ్‌కు కలిసొచ్చింది. కివీస్ ఖాతాలో 2 పాయింట్లు కోత పడగా.. టీమ్ఇండియాకి 2 పాయింట్లు అదనంగా జమ అయ్యాయి. దీంతో భారత్ మూడో స్థానంలోకి దూసుకొచ్చింది. కివీస్ రెండో స్థానంలోకి పడిపోయింది. తాజా సిరీస్‌లో మంగళవారం జరిగే చివరి వన్డేలోనూ టీమ్ఇండియా విజయం సాధిస్తే అగ్రస్థానంలోకి దూసుకెళ్లే అవకాశం ఉంది. అలాగే వచ్చే నెలలో ఆస్ట్రేలియాతో జరిగే నాలుగు టెస్టుల సిరీస్‌నూ భారత్ సొంతం చేసుకొంటే.. సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ అగ్రస్థానంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా, కివీస్‌పై డబుల్ సెంచరీ సాధించిన భారత ఆటగాడు శుభ్‌మన్ గిల్ (624 పాయింట్లు) ఏకంగా పది ర్యాంక్‌లను ఎగబాకి 26వ స్థానంలోకి దూసుకొచ్చాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (750) కూడా నాలుగు స్థానాలను మెరుగుపర్చుకొని నాలుగో స్థానంలోకి వచ్చాడు. టీ20ల్లో సూర్యకుమార్ యాదవ్ (908 పాయింట్లు) అగ్ర స్థానంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68